ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న ప్రభుత్వం



వివరాలు 2లో..

బలగం TV
BALAGAM
నిజమే మా బలం..ప్రజలే మా బలగం
BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com
హైదరాబాద్ బుధవారం 09, సెప్టెంబర్-2026 | balagamtv100@gmail.com | పేజీలు-8

పోలీస్ స్టేషన్ల వద్ద హైటెన్షన్..



వివరాలు 2లో..

# బీఆర్ఎస్ నేతలపై పోలీసుల దౌర్జన్యం!

- ఎర్రవల్లికి వెళ్లనీయకుండా అడ్డగింత
- పోలీసుల తీరుపై కేటీఆర్ ఆగ్రహం
- బోయిన్‌పల్లి ఠాణాకు కేటీఆర్.. జవహర్ నగర్‌కు హరీశ్‌రావు..
- కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా బీఆర్ఎస్ శ్రేణుల ఆందోళన.. ఉద్రిక్తత



హైదరాబాద్, సెప్టెంబర్ 07: తమను ఎందుకు అడ్డుకుంటున్నారన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై 'ఎవడ్రా నువ్వు.. మాకే చెప్తావా?' అంటూ ఓ పోలీసు అధికారి దౌర్జన్యానికి దిగారు. తోటి పోలీసులు కూడా పూనకంతో ఊగిపోయారు. దురుసుగా ప్రవర్తించారు. హైదరాబాద్ నుంచి ఎర్రవల్లిలోని కేసీఆర్ నివాసానికి వెళ్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్ ఇతర బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు బొల్లారం మిగతా 3లో..

## ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిపై
# సస్పెన్షన్ వేటు

- మండలి చైర్మెన్ గుత్తా ప్రకటన తీర్మానాన్ని ప్రతిపాదించిన మంత్రి శ్రీధర్ బాబు





హైదరాబాద్, సెప్టెంబర్ 8: శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యల వ్యవహారంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధుసూదన్, ఎన్.నవీన్‌కు మార్‌రెడ్డిపై మండలి చైర్మెన్ గుత్తా సుఖేం దర్‌రెడ్డి సస్పెన్షన్ వేటు వేశారు. మంగళ వారం సాయంత్రం వారిద్దరిని సస్పెండ్ చేయాలని శాసనమండలిలో రాష్ట్ర శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు తీర్మానం ప్రవేశపెట్టారు. దీనిపై చైర్మెన్ మూజువాణి పద్ధతిలో ఓటింగ్ నిర్వహించారు. అనంతరం ప్రస్తుత సెషన్ మొత్తానికి ఇద్దరు ఎమ్మెల్సీలను సస్పెండ్ చేసినట్టు ప్రకటించారు. మండలిని బుధవారం ఉదయం 10 గంటలకు వాయిదా వేశారు. సభ సాయంత్రం తిరిగి ప్రారంభం కాగానే, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అడ్డుకుని, మహిళా సభ్యులను అడ్డగించిన పోలీసుల తీరుపై ఆ పార్టీ శాసనమండలి పక్షనేత మధుసూదనాచారి ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని చైర్మెన్ తిరస్కరించారు. వారిద్దరిపై శాసనమండలి సభా హక్కులు, సభా విధానాలు, క్రమశిక్షణకు సంబంధించిన నిబంధనలకు అనుగుణంగా శాసనమండలి చైర్మెన్ తదుపరి చర్యలు తీసుకోవాలని మిగతా 3లో..

## తుపాకీ పేలి డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ మృతి



హైదరాబాద్, సెప్టెంబర్ 8: ఉత్తరప్రదేశ్‌లోని కౌశాంబి జిల్లా, మంఝన్‌పూర్ మహిళా PS లో తాజాగా విషాద ఘటన జరిగింది. మంగళవారం ఉదయం విధి నిర్వహణలో ఉన్న ప్రియాంక యాదవ్ అనే 28 ఏళ్ల మహిళా కానిస్టేబుల్, కుర్చీలో కూర్చుంటుండగా ఆమె వద్ద ఉన్న సర్వీస్ రైఫిల్ నుండి బుల్లెట్ పేలింది. తీవ్ర గాయాలపాలైన ప్రియాంకను తోటి సిబ్బంది ఆసుపత్రికి తరలించగా, ఆమె అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఘటనపై ఉన్నతాధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

## కాంగ్రెస్ ఎమ్మెల్యేపై తక్షణమే
# అసెంబ్లీలో తీర్మానం పెట్టాలే

- బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఫైర్



హైదరాబాద్, సెప్టెంబర్ 08: రేవంత్ రెడ్డి మాట్లాడితే కేసీఆర్ చావును కోరుకుంటాడు.. కేసీఆర్ చావు గురించి మాట్లాడుతా ఉం టా డు.. కేసీఆర్ పేగులు ఊడపీకి మెడలో వేసు కుంటా అని మాట్లాడుతుంటాడు.. కేసీఆర్ కండ్ల గుడ్లు ఊడపీకి గోటీలాడుతా అని మాట్లాడుతాడని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ఫైర్ అయ్యా రు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ... చావు భాష మాట్లాడే రేవంత్ రెడ్డి.. ఇవాళ ఎమ్మె ల్యేల చేత కూడా కేసీఆర్ చావాలని చెప్పి మా ట్లాడి స్తున్నడు. షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఇవాళ కేసీఆర్ చావాలి.. దరిద్రం.. కేసీఆర్ చచ్చిపోతే పీడపోతది అని కాంగ్రెస్ ఎమ్మెల్యే మాట్లాడటమంటే.. అది రేవంత్ రెడ్డి ప్రేరేపించి మాట్లాడిస్తున్న మాట అన్నారు. కేసీ ఆర్ చావును కోరుతూ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ మాట్లాడిండు కదా.. ఆ ఎమ్మెల్యేపై తక్షణమే అసెంబ్లీలో తీర్మానం పెట్టాలే. ఆయన శాసన సభ్యత్వాన్నిరద్దు చేయాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తుంద న్నారు హరీశ్ రావు. ఏమీ అనని మా నవీన్ రెడ్డి ఎమ్మెల్సీ సభ్యత్వం రద్దు చేస్తామని మీరు మిగతా 3లో..

## బ్రిక్స్ సదస్సుకు పుతిన్, జిన్‌పింగ్, ఇరాన్ అధ్యక్షుడు..

### నేతల భేటీపైనే అందరి గురి



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 08: ప్రతిష్టాత్మక బ్రిక్స్ సదస్సుకు ఈ ఏడాది ఇండియా ఆతిథ్యం ఇవ్వబోతుంది. ప్రధాని మోదీ అధ్యక్షతన న్యూఢిల్లీలో సెప్టెంబర్ 12, 13 తేదీల్లో ఈ సదస్సు జరగనుంది. ఈ సదస్సుకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కిన్ వంటి కీలక నేతలు హాజరుకానున్నారు. దీంతో ఈ సదస్సుపై ప్రపంచం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ఇరాన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత ఇలా ఇరాన్ అధ్యక్షుడు ప్రపంచ దేశాధినేతలతో అంతర్జాతీయ సదస్సులో సమావేశం కావడం ఇదే మొదటిసారి. ఈ సదస్సులో వివిధ దేశాధినేతలు సమావేశం కానున్నారు. ఈ సందర్భంగా ద్వైపాక్షిక అంశాలపై చర్చిస్తారు. రష్యా అధ్యక్షుడు పుతిన్.. ఏడాది వ్యవధిలో ఇండియాలో పర్యటించనుండటం రెండోసారి. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ చాలా ఏళ్ల తర్వాత ఇండియా వస్తున్నారు. అనేక విబేధాలున్న మిగతా 3లో..

## అక్రమ కేసులతో బీఆర్ఎస్‌ను భయపెట్టలేరు

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్, సెప్టెంబర్ 08: పోలీసులను అడ్డుపెట్టుకుని బీఆర్ఎస్ నాయకులను, కార్యకర్తలను వేధించాలని ప్రభుత్వం చూస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసానికి కాలి నడకన వెళ్తున్న కేటీఆర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు సహా ఇతర బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు హకీంపేట వద్ద అరెస్ట్ చేసి వారిని బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ వద్ద కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. ఇలాంటి కక్షపూరిత చర్యలకు మేము భయపడేది లేదన్నారు. ప్రజా సమస్యల నుండి దృష్టి మళ్లించడానికే కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి అక్రమ అరెస్టులు, కేసులు పెడుతోందని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ ప్రజల పక్షాన ఉంటుంది. ప్రజా గొంతుకగా మిగతా 3లో..

## కాంగ్రెస్ మూకలను తరిమిన గ్రామస్తులు



- అసెంబ్లీ నుంచి ఎర్రవల్లి దాకా రేవంత్ సేన వీరంగం
- అడుగడుగునా అడ్డుకొని ఉరికించిన ప్రజాగ్రహం
- ఎదురుతన్నిన డైవర్షన్.. 8 గంటలు హైటెన్షన్
- కాంగ్రెస్ ఎమ్మెల్యేలనాయకత్వంలో మాజీ సీఎం
- నివాసం వైపు దూసుకొచ్చిన కిరాయి మూకలు
- గూండాలకు ఎస్కార్ట్ ఇచ్చి మరీనడిపిన ఖాకీలు
- కేసీఆర్ కోసం రోడ్డుమీదికి వచ్చిన అభిమానులు
- రక్షణ కవచంగా నిలిచిన ఎర్రవల్లి పరిసర పల్లెలు
- వచ్చినవారిని వచ్చినట్టు తన్నితరిమిన ప్రజలు
- తోపులాటలో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డికి దెబ్బలు
- పోలీసుల రక్షణలో కాంగ్రెస్ ఎమ్మెల్యేల పరుగులు

4లో..

## ఆశాల 'చలో హైదరాబాద్' ఉద్రిక్తం



- దోమలగూడ నుంచి ర్యాలీ..
- ఇందిరాపార్కు సిగ్నల్ వద్ద ధర్నా

4లో..

## నిరంకుశ పాలనలో నిర్బంధకాండ



- తెల్లవారుజాము నుంచే బీఆర్ఎస్ నేతల ఇండ్లలోకి చొరబడిన పోలీసులు
- ఎమ్మెల్సీల అక్రమ పవర్తనలు..
- భగ్గుమన్న గులాబీ శ్రేణులు
- డైవర్షన్ పాలిటిక్స్‌కు పోలీసుల అండ !

వివరాలు 3లో..

## మహిళపై మళ్లీ దౌర్జన్యం..



- రోడ్డెక్కిన వివిధ వర్గాలు.. ఉక్కుపాదం మోపిన సర్కార్
- ఆశా కార్యకర్తల ఆందోళనపై పోలీసుల ప్రతాపం
- బెనిఫిట్స్ కోసం గొంతెత్తిన ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు
- సర్కార్ ధోకాపై ల్యాండ్ సర్వేయర్ల అసెంబ్లీ ముట్టడి
- ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై విద్యార్థుల పోరాటం

వివరాలు 3లో..

బలగం TV BALAGAM
balagamtv100@gmail.com

# నవీన్ కుమార్ రెడ్డి, తాతా మధు సస్పెండ్..

● బీఆర్ఎస్ ఎమ్మెల్సీల నిరసన..



హైదరాబాద్, సెప్టెంబర్ 08: మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిని ఏక పక్షంగా సస్పెండ్ చేశారు. శాసనమండలి నుండి ఎమ్మెల్సీలు నవీన్ కుమార్ రెడ్డి, తాతా మధులను సస్పెండ్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు ఆందోళన చేపట్టారు. సభలో చర్చించకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఛాంబర్ ఎదుట బైఠాయించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు ప్రభుత్వ నిరంకుశ వైఖరి, అప్రజాస్వామిక వైఖరి, చట్ట వ్యతిరేక వైఖరి, సభా వ్యతిరేక వైఖరి నశించాలి.. మహిళా ద్రోహి ప్రభుత్వం, దుర్యోధన, దుశ్శాసన, దృతరాష్ట్ర ప్రభుత్వం నశించాలి.. పిరికి ప్రభుత్వం నశించాలి.. రేవంత్ రెడ్డి డౌన్ డౌన్.. రేవంత్ రెడ్డి పిరికిపంద.. రూల్స్‌కు విరుద్దంగా చేసిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలి అంటూ నినాదాలు చేశారు. మరోవైపు ఎమ్మెల్సీ మీడియా పాయింట్‌లో మాట్లాడుతుండగా తాతా మధుపై అసెంబ్లీ మార్షల్స్ దౌర్జన్యం చేశారు. మార్షల్స్ బలవంతంగా ఎమ్మెల్సీలు మధు, నవీన్ కుమార్ రెడ్డిని మీడియా పాయింట్ నుంచి లాక్కెళ్లారు.

# ఆ కాంగ్రెస్ ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయాలి..



## బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్ ఫిర్యాదు

హైదరాబాద్, సెప్టెంబర్ 08: బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గురించి అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయాలని బీఆర్ఎస్ సీనియర్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసీఆర్ చావాలని, తాము కేసీఆర్ చావును కోరుకుంటున్నామని కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తలబిరుసు వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ శ్రేణులు భగ్గుమంటున్నాయి. ఇదిలావుంటే ఒకవైపు అసెంబ్లీ సమావేశాలు నడుస్తుండగానే సమావేశాలకు హాజరుకాకుండా అధికార పార్టీ ఎమ్మెల్యేలు కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై దాడికి వెళ్లారు. పోలీసులు వారిని దగ్గరుండి మరీ కేసీఆర్ ఫామ్ హౌస్‌కు తీసుకెళ్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అదే సమయంలో కాంగ్రెస్ కుట్రను పసిగట్టిన బీఆర్ఎస్ శ్రేణులు తమ అధినేత క్షేమం కోసం ఫామ్ హౌస్ వైపు పోలీసులు అడ్డు తగిలి అరెస్టులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బంజారాహిల్స్ పీఎస్‌లో వీర్లపల్లి శంకర్‌పై ఫిర్యాదు చేశారు.

# బోయిన్‌పల్లి, జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ల వద్ద హైటెన్షన్..



## భారీగా తరలివస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

హైదరాబాద్, సెప్టెంబర్ 08: బోయిన్‌పల్లి, జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ల వద్ద హైటెన్షన్ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీఆర్ఎస్ నాయకులపై రేవంత్ రెడ్డి సర్కార్ కక్షసాధింపు చర్యలపై బీఆర్ఎస్ కార్యకర్తలు భగ్గుమంటున్నారు. బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్,మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్ట్ నేప థ్యంలో బీఆర్ ఎస్ శ్రేణులు భారీగా తరలివస్తున్నారు.పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించిన బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అక్రమంగా అరెస్ట్ చేసిన నేతలను వెంటనే విడు దల చేయాలని డిమాండ్ చేశారు. ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసానికి కాలి నడకన వెళ్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు సహా ఇతర బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు హకీంపేట వద్ద అరెస్ట్ చేశారు. వారిని బోయిన్‌పల్లి, జవహర్ నగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మరో వైపు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ అరాచక పర్వం కొనసాగుతోంది. ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివా సంపై దాడికి కాంగ్రెస్ గూండాలు బయల్దేరారు. కేసీ ఆర్‌పై జరుగుతున్న ఈ కుట్రలు తెలిసిన కేటీఆర్, హరీశ్ రావుసహా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్నఫళంగా అసెంబ్లీ నుంచి ఎర్రవెల్లికి బయల్దేరారు. ఈ క్రమం లో ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకులతో పోలీసులు అహంకారపూరితంగా ప్రవర్తించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై పోలీసుల జులుం ప్రదర్శిం చారు. పోలీసుల తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తున్నాయి.

# నాంపల్లి కోర్టులో ప్రభుత్వానికి చుక్కెదురు..

● బీఆర్ఎస్ ఎమ్మెల్సీల రిమాండ్ తిరస్కరణ



హైదరాబాద్, సెప్టెంబర్ 08: నాంపల్లి కోర్టులో కాంగ్రెస్ ప్రభుత్వానికి చుక్కెదురైంది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు నవీన్ రెడ్డి, తాతా మధు రిమాండ్‌ను కోర్టు తిరస్కరించింది. ఇద్దరికీ చెరొక రూ.20,000 చొప్పున పూచికత్తుతో పాటు రెండు షూరిటీలు సమర్పించాలని ఆదేశించింది. కాగా, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు (తాతా మధుసూదన్), ఎన్. నవీన్ కుమార్ రెడ్డిలను సైఫాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు.మంగళవారం ఉదయం వీరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు, నాంపల్లిలోని అడిషనల్ చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచిన విషయం తెలిసిందే. తాము స్పీకర్‌ను ఉద్దేశించి ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని, తమను అడ్డుకున్న పోలీసులను ఉద్దేశించే ఆ వ్యాఖ్యలు చేశామని ఎమ్మెల్సీ తాతా మధు స్పష్టం చేశారు. ప్రభుత్వం కావాలనే తప్పుడు కేసులు పెడుతుందని ఆరోపించారు.

# ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న ప్రభుత్వం: జాన్సన్ నాయక్





హైదరాబాద్, సెప్టెంబర్ 08: ప్రజా సమస్యలు, కాంగ్రెస్ మోసపూరిత హామీలు, విఫల పాలనపై ప్రజాస్వామ్య బద్ధంగా, శాసనసభ వేదికగా ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ శాసన సభ, శాసన మండలి సభ్యులను అడ్డుకోవడం, అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల అరెస్టులను నిరసిస్తూ మంగళవారం ఖానాపూర్ తెలంగాణ చౌక్ వద్ద మహిళలతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులను అడ్డుకునేందుకు ప్రయత్నించడంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అనంతరం తెలంగాణ చౌక్ నుంచి అంబేద్కర్ విగ్రహం వద్దకు ర్యాలీ తీశారు. అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించి, కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు, ప్రజా సమస్యల పరిష్కారంలో వైఫల్యాలను నిరసిస్తూ రూపొందించిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా జాన్సన్ నాయక్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగ హక్కులను ఉల్లంఘిస్తూ ప్రజాపాలన పేరుతో ప్రజాప్రతినిధులపై దాడులకు పాల్పడటం సిగ్గుచేటు అని అన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే ప్రతిపక్ష నాయకులను అడ్డుకోవడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం తన అసహనాన్ని బయటపెట్టుకుంటోందని విమర్శించారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు సభ్యసమాజం తలదించుకునేలా ఉందని మండిపడ్డారు. పోలీసులను అడ్డం పెట్టుకుని రేవంత్‌రెడ్డి శాసనసభ సభ్యుల హక్కులను కాలరాసేలా చేసిన కుట్రలను తెలంగాణ సమాజం గమనిస్తోందని త్వరలోనే రేవంత్‌రెడ్డికి రాష్ట్ర ప్రజలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. అధికారం చేపట్టి వెయ్యి రోజులు దాటినా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను నిలువునా మోసం చేసిన ఈ ప్రభుత్వానికి తగిన మూల్యం తప్పదని హెచ్చరించారు. కేటీఆర్ లేవనెత్తుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పలేని కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్ అసెంబ్లీకి రావాలని కోరడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. నిరసన తెలిపే హక్కు ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ ఉంటుందని, ఆ హక్కును హరించాలని చూడటం సీఎం రేవంత్‌రెడ్డి మూర్ఖత్వమని మండిపడ్డారు. ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజల సమస్యలపై పోరాడటానికి బీఆర్ఎస్ వెనక్కి తగ్గదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షోయబ్ హుస్సేన్, కౌన్సిలర్ తొడసం ఇందిర, మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు ఈశ్వరీబాయి, మాజీ జడ్పీటీసీ రామునాయక్, బీఆర్ఎస్ నాయకులు అబ్బుల్ ఖలీల్, పుష్పాల గజేందర్, కొక్కుల ప్రదీప్, గౌరికర్ రాజు, సల్ల నరేందర్, శనిగారపు శ్రావణ్, నల్ల జీవన్‌రెడ్డి, కారింగుల సుమన్, నాగేందర్‌రావు, గాండ్ల శంకర్, రాజేశ్వర్ గౌడ్, బాపురావు, వాల్‌సింగ్, ధరంసోత్ వసంత్, లింగన్న, పానగంటి రాజేందర్, మహిపాల్, కొక్కుల శేఖర్, అజ్మీరా కవిత, కళావతి పాల్గొన్నారు.

# పిరికితనంతో పరారైన కాంగ్రెస్ ప్రభుత్వం

● శాసన మండలి చరిత్రలో ఇవాళ భయంకరమైన దుర్దినం..!



హైదరాబాద్, సెప్టెంబర్ 08: చట్ట సభల్లో గత రెండు రోజులుగా జరుగుతున్న పరిణామాలు చీకటి అధ్యాయమని మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూధనా చారి అభివర్ణించారు. మంగళవారం రాత్రి ఆయన శాసన మండలి మీడియా పాయింట్‌లో సహచర ఎమ్మెల్సీలతో మాట్లాడుతూ.. సభ్యులపై పోలీసులను ఉసిగొల్పి దుర్మార్గంగా వ్యవహరించిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం పిరికితనంతో పరారైందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం దారుణమైన స్థితిలో ఉందన్న మధుసూధనా చారి.. దేశ సరిహద్దుల్లో బలగాలను మోహరించినట్లుగా వందలాది మంది పోలీసులను పెట్టించి సభ్యులపై దాడికి పాల్పడిందని మండిపడ్డారు. అసెంబ్లీ సమావేశాల తొలిరోజే కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను బీఆర్ఎస్ పక్షాన మేం ప్రశ్నిస్తే జవాబు లేదు, కాబట్టే ప్రధాన ప్రతిపక్షం లేకుండానే సభ నడిపించే ఎత్తుగడను ఈరోజు కూడా కొనసాగించారని మధు సూధనా చారి ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ మహి ళా ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి పట్ల పోలీసుల అనుచిత ప్రవర్తనను ఆయన తప్పు పట్టారు. సహచర ఎమ్మెల్సీలు తాత మధు, నవీన్ రెడ్డిలపై కేసులు నమోదు చేయడం.. వారి సభ నుంచి బహిష్కరించేందుకు ఏకపక్షంగా తీర్మానం చేయడంపై మేం చర్చకు పట్టుబట్టగా రేవంత్ సర్కార్ సమాధానం చెప్పలేకపోయిందని ఆయన వెల్లడించారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల దాకా వెయిటింగులో పెట్టి, ఎలాంటి చర్చ లేకుండా 3 నిమిషాల్లోనే సభను వాయిదా వేసి కాంగ్రెస్ ప్రభుత్వం పరారైందని మధుసూదనా చారి దుయ్యబట్టారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ పిరికితనానికి పరాకాష్ట అని ఆయన పేర్కొన్నారు. శాసన మండలి చరిత్రలో ఇవాళ భయంకరమైన దుర్దినం అని మధుసూధనా చారి అభివర్ణించారు. మండలిలో ఇరవై మందికి పైగా సభ్యులున్న బీఆర్ఎస్ పక్షాన్ని ..ఏడెనిమిది మంది సభ్యులున్న కాంగ్రెస్ పక్షం తట్టుకోలేకపోతోందని ఆయన తెలిపారు. అందుకే తీర్మానాన్ని నెగ్గించుకునే అవకాశం లేక, ఆగమేఘాల మీద చదివి, మూడంటే మూడు నిమిషాల్లోనే పాస్ చేయించుకొని ఈ ప్రభుత్వం అప్రజాస్వామికంగా వ్యవహరించి పరారైందని మండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూధనాచారి ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా మీడియా పాయింట్‌లో మధుసూధనా చారితో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, దేశపతి శ్రీనివాస్, ఎల్.రమణ, తాతా మధు, నవీన్ రెడ్డి, యాదవరెడ్డి, కోటిరెడ్డి తదితరులు ఉన్నారు.

# మీటర్ రీడర్ల మెరుపు ధర్నా



హైదరాబాద్, సెప్టెంబర్ 08: జలమండలి పరిధిలో పనిచేస్తున్న మీటర్ రీడర్ల జీవితాలను ప్రశ్నార్థకంలో నెట్టేలా తీసుకొచ్చిన అక్రమ కమిషన్ ఆధారిత టెండర్‌ను వెంటనే రద్దు చేయాలని ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బాలకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మీటర్‌రీడర్లు జలమండలి ఎదుట మెరుపు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జీవో 60 ప్రకారం ప్రస్తుతం పనిచేస్తున్న మీటర్ రీడర్ల సేవలను కొనసాగించాలని, కమీషన్ ఆధారిత టెండర్‌ను వెంటనే రద్దు చేయాలని కోరారు. మిగతా ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల మాదిరే తమకు కూడా ప్రతి నెలా మొదటి తారీఖునే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం జలమండలి రెవెన్యూ సీజీఎం కిరణ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపేందర్‌రెడ్డి, మనోజ్, వినోద్, విక్రమ్, అంజిరెడ్డి, చంద్రశేఖర్, రాజు, శేఖర్,గిరి, శ్రీకాంత్, మధు పాల్గొన్నారు.

## అసెంబ్లీ సమావేశాల వేళ కాంగ్రెస్ అరాచకపర్వం.. రాష్ట్రవ్యాప్తంగా ముందస్తు అరెస్టులు!

కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో చేసిన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు రాష్ట్రవ్యాప్తంగా అరాచకపర్వానికి తెరలేపింది. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ప్రభుత్వాన్ని నిలదీసేందుకు, ప్రజా సమస్యలపై నిరసనలు చేపట్టేందుకు సిద్ధమైన వారిని ఎక్కడికక్కడ ముందస్తు అరెస్టు చేస్తోంది. ప్రజలకు మధ్యకు సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం.. నిరసనలకు వెళ్లకుండా పోలీసులను ప్రయోగించి గొంతులు నొక్కే చర్యలకు దిగింది. సికింద్రాబాద్ శాసన సభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ టి.పద్మారావును సికింద్రాబాద్ మోండా మార్కెట్‌లోని ఆయన నివాసంలో హౌస్ అరెస్టు చేశారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలోనూ ఉదయం నుంచే బీఆర్ఎస్ నాయకుల ఇళ్లకు పోలీసులు వెళ్లి గృహనిర్బంధాలు, అరెస్టులు చేపట్టారు. బోయినపల్లిలో మార్కెట్ మాజీ చైర్మన్ టి.ఎన్. శ్రీనివాస్‌ను గృహనిర్బంధం చేశారు. ఐదో వార్డులో ఉద్యమకారుడు రావుల సతీష్‌తో పాటు మరో నలుగురు కార్యకర్తలను కార్ఖానా పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కంటోన్మెంట్ బోర్డు మాజీ వైస్ చైర్మన్ జక్కుల మహేశ్వర్‌రెడ్డి ఇంటికి బోయినపల్లి పోలీసులు వెళ్లారు. ఆయన అప్పటికే బయటకు వెళ్లడంతో పోలీసులు ఇంటి వద్దే కాపలా ఉన్నారు. బోర్డు మాజీ సభ్యుడు కే. పాండు యాదవ్‌ను మర్రి రామ్‌రెడ్డి కాలనీలోని ఆయన నివాసంలో పోలీసులు గృహనిర్బంధం చేశారు. ఇదే క్రమంలో బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మన్నె క్రిశాంక్ ఇంటికి ఉదయాన్నే కార్ఖానా సీఐ అనురాధ వెళ్లారు. క్రిశాంక్ ఇంట్లో లేని సమయంలో కుటుంబ సభ్యులతో సీఐ వాగ్వాదానికి దిగిన దృశ్యాలు వీడియోలో నమోదయ్యాయి. ఇంట్లో చిన్నపాప ఉందని, తన భర్త ఇంట్లో లేరని క్రిశాంక్ సతీమణి సుహాసిని చెప్పినా.. ఇంట్లోకి వస్తానంటూ సీఐ వాగ్వాదానికి దిగారు. లోపలేస్తా నా కొడకా.. తమషా చేస్తున్నారా అంటూ పనివాళ్లపై బూతులతో రెచ్చిపోయారు. అనంతరం మన్నె క్రిశాంక్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై పోలీసుల జులుం



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 08: తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ అరాచకపర్వం కొనసాగుతోంది. ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసంపై దాడికి కాంగ్రెస్ గూండాలు బయల్దేరారు. కేసీఆర్‌పై జరుగుతున్న ఈ కుట్రలు తెలిసిన కేటీఆర్, హరీశ్‌రావు సహా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్నఫళంగా అసెంబ్లీ నుంచి ఎర్రవెల్లికి బయల్దేరారు. ఈ క్రమంలో ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకులతో పోలీసులు అహంకారపూరితంగా ప్రవర్తించారు. ఎవడ్రా నువ్వు అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై పోలీసుల జులుం ప్రదర్శించారు. పోలీసుల తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తున్నాయి.

## సభలో బీఆర్ఎస్‌కు ఒక న్యాయం, బీజేపీకి ఒక న్యాయమా..? : అక్బరుద్దీన్ ఒవైసీ



హైదరాబాద్, సెప్టెంబర్ 08: శాసనసభలో బీఆర్ఎస్ పార్టీకి ఒక న్యాయం, బీజేపీకి ఒక న్యాయమా..? అని ఎంఐఎం పార్టీ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నల్లని టీషర్టులు, వాటిపై ఏదో రాసి ఉందనే కారణంతో వారిని సభలోకి అనుమతించలేదని, మరి బీజేపీ సభ్యులు ప్లకార్డులను ప్రదర్శించడాన్ని ఎందుకు అనుమతించారని ఆయన నిలదీశారు. టీషర్టుల ధరిస్తే సభలోకి అనుమతి లేనప్పుడు, సభలో ఫొటలతో కూడిన ప్లకార్డులు ప్రదర్శించేందుకు కూడా ఇవ్వకూడదు కదా అని క్వశ్చన్ చేశారు. మీరు ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీని ఒకలా, బీజేపీని ఒకలా ట్రీట్ చేస్తున్నారని, ఇది కరెక్టు కాదని అక్బరుద్దీన్ చెప్పారు. బీజేపీకి స్పెషల్ ట్రీట్‌మెంట్ ఎందుకని ప్రశ్నించారు. రూల్స్ అందరికీ ఒకేలా ఉండవా..? అని వ్యంగ్యంగా ప్రశ్నించారు. అసెంబ్లీ సాక్షిగా అక్బరుద్దీన్ ఒవైసీ ప్రభుత్వ తీరును ఈ విధంగా ఎండగట్టారు. సభాపతి స్థానంలో కడియం శ్రీహరి కూర్చుని ఉన్న సమయంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

# లైసెన్స్‌డ్ సర్వేయర్ల అసెంబ్లీ ముట్టడి



హైదరాబాద్, సెప్టెంబర్ 08: కాంగ్రెస్ సర్కార్ పాలనలో ఓ వైపు ఉద్యోగ నోటిఫికేషన్లు లేక నిరుద్యోగులు ఆందోళన చేస్తుంటే.. మరో వైపు ఉద్యోగులు తమ డిమాండ్లు నెరవేర్చాలంటూ రోడ్డెక్కు తున్నారని తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు రేవంత్ సర్కార్ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆందోళన బాట పడుతున్నారు. తాజాగా ఈ జాబితాలో లైసెన్స్‌డ్ సర్వేయర్లు కూడా చేరిపో యారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ డిమాండ్లు నెరవేర్చాలని లైసెన్స్‌డ్ సర్వేయర్లు అసెంబ్లీని ముట్టడించారు. ఈ క్రమంలో లైసెన్స్‌డ్ సర్వేయర్లను అరెస్ట్ చేసిన పోలీసులు పోలీస్ స్టేషన్లకు తరలించారు. పోలీసులు లైసెన్స్‌డ్ సర్వేయర్లను వెంబడించి.. పరుగెత్తించి మరీ అరెస్ట్ చేయడం వీడియలో చూడొచ్చు.

## (మొదటిపేజీ తరువాయి)

# బీఆర్ఎస్ నేతలపై పోలీసుల దౌర్జన్యం!



చెక్‌పోస్టు వద్ద అడ్డుకున్నారు. సాఫీగా వెళ్తున్న తమను ఎందుకు అడ్డుకుంటున్నారని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు పోలీసులను ప్రశ్నించారు. అంతే అక్కడున్న పోలీసులు రెచ్చిపోయారు.'ఎవడ్రా నువ్వు' అంటూ దౌర్జన్యంగా ప్రదర్శించారు. పోలీసుల వ్యవహారశైలిపై బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. ప్రజాప్రతినిధులను ముందుకు వెళ్లనీయకుండా కాన్వాయ్‌ను పోలీసులు అడ్డుకొని దౌర్జన్యానికి పాల్పడుతున్నారంటూ నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. పోలీసుల తీరుపై కేటీఆర్, ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, కౌశిక్‌రెడ్డి మండిపడ్డారు. తమ నాయకుడిని కాపాడుకోవడానికి వెళ్తుంటే తమనే ఎందుకు అండుకుంటున్నారంటూ కేటీఆర్ పోలీసులను ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ గుండాలు, పోలీసులు కలిసి కేసీఆర్‌ను చంపే ప్రయత్నం చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. దీంతో అక్కడ పోలీసులకు, నాయకులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకొన్నది. బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందుకు కదలనీయకుండా అడ్డుకొని వారిని అరెస్ట్ చేసి కేటీఆర్‌ను బోయిన్‌పల్లి, హరీశ్‌రావును జవహర్‌నగర్ ఠాణాకు తరలించారు.

# ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు

కోరుతూ శాసనసభ తీర్మానించిందని చైర్మెన్ తెలిపారు. అంతకుముందు మంగళవారం ఉదయం 10 గంటలకు సభ ప్రారంభం కాగానే స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ సభ్యులు తాతా మధుసూదన్, ఎన్.నవీన్ రెడ్డిలపై చర్యలు తీసుకోవాలని మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రతిపాదించారు. దీంతో బీఆర్ఎస్ మండలి పక్షనేత మధుసూదనాచారితో పాటు పలువురు సభ్యులు గుత్తా నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సభలో ఆందోళన చేపట్టారు. బీఆర్ఎస్ సభ్యుల ఆందోళన మధ్యే కాంగ్రెస్ ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ తన ప్రసంగాన్ని కొనసాగించారు. స్పీకర్ ను కులం పేరుతో దూషించడం దేశ చరిత్రలో మొదటిసారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ మొదటి నుంచి ఫ్యూడల్ భావజాలాన్ని పుణికి పుచ్చుకుందని ఆరోపించారు. దళిత స్పీకర్ పై అనుచితంగా వ్యాఖ్యలు చేసిన వారిని ఇంకెంత మాత్రం ఉపేక్షించవద్దని కోరారు. అలా ఉపేక్షిస్తే ప్రజలు క్షమించరని ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. వెంటనే వారిద్దరిని సస్పెండ్ చేయాలని ఆయన కోరారు. శాసనసభలో భట్టి విక్రమార్కకు ప్రతిపక్ష హోదా దక్కకుండా ఎమ్మెల్యేల కొనుగోలు చేయడం, ఉప ముఖ్యమంత్రి రాజయ్యను మంత్రివర్గం నుంచి బహిష్కరించడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. సభ్య సమాజం తల వంచుకునేలా వ్యవహరించిన ఇద్దరు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలను వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ సభ్యులు పోడియం వద్దకు దూసుకెళ్లి నిరసన వ్యక్తం చేయడంతో సభను చైర్మెన్ వాయిదా వేశారు. తిరిగి సభ ఉదయం 11 గంటలకు ప్రారంభం కాగానే బీఆర్ఎస్ ఎమ్మెల్సీలపై చర్యలు తీసుకోవాలని మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క, వాకిటి శ్రీహరి డిమాండ్ చేశారు. తాతా మధు యావత్ దళిత సమాజాన్ని కించపరిచే విధంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వారిద్దరి సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరారు. ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రతినిధులు చట్టసభల గౌరవం, ప్రతిష్ట పెరిగేలా హుందాగా ప్రవర్తించాలని సూచిం చారు. సభ్యులందరూ సభా నియమాలు, సంప్రదాయాలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ సభ్యులు మహిళా పోలీసుల పట్ల అనుచితంగా ప్రవర్తించారనీ, వారిపై మహిళా కమిషన్ కు ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు. మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు అనుచితంగా ప్రవర్తిస్తే వారిపైన చర్యలు తీసుకుంటామని వారు ప్రకటించారు.

# కాంగ్రెస్ ఎమ్మెల్యేపై తక్షణమే అసెంబ్లీలో తీర్మానం పెట్టాలే

పూను కున్నరే.. ఇయ్యాళ్ల టీవీల్లో మార్మోగుతోంది.. బహిరంగంగానే ప్రెస్ మీట్‌లోనే కేసీఆర్ ప్రతిపక్ష నేత, తెలంగాణ సాధించిన నాయ కుడు, పదేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన నాయకుడి చావు కోరుకునే హక్కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ప్రోద్భలంతోనే ఆయన శిష్యుడిగా శంకర్ మాట్లాడిన మాటల మీద స్పీకర్‌కు వినబడతలేదా.. సభలో ముఖ్యమంత్రి తర్వాత ఆ స్థానం ప్రతిపక్ష నాయకుడిది. స్పీకర్ దీని మీద ఎందుకు చర్య తీసుకోరని హరీశ్ రావు ప్రశ్నించారు. దీని మీద ఎందుకు చర్చ పెట్టరు.. ఎందుకు ఆ శాసనసభ్యుడిని తీసివేయరని అడుగుతున్నానన్నారు. మా మహిళా శాసనసభ్యుల మీద దాడి జరిగితే అసలు దాడే జరుగలేదం టారు. స్పీకర్ ఏకపక్షంగా వ్యవహరించడం సరైంది కాదన్నారు హరీశ్ రావు. ప్రతిపక్ష నాయకుడి చావును కోరుకుంటే అది మీకు కనబడదు.. వినబడదు.. ఇదేం ప్రజాస్వామ్యమని ప్రశ్నించారు. స్పీకర్‌గా మీరు 119 మంది ఎమ్మెల్యేలను సమానంగా చూడాలన్నారు.

# బ్రిక్స్ సదస్సుకు పుతిన్, జిన్‌పింగ్, ఇరాన్ అధ్యక్షుడు..



ఇండియా–చైనా మధ్య పలు సమస్యల పరిష్కారానికి, సంబంధాల బలోపేతానికి ఈ పర్యటన ఉపయోగపడుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.గత ఏడాది మోదీ కూడా చైనాలో పర్యటిం చారు. ఇరాన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత ఆ దేశ అధ్యక్షుడు ఇండియాలో పర్యటిస్తుండటం కూడా ఆసక్తిని కలిగిస్తోంది. ఈ సదస్సుకు ఈజిప్ట్, ఇండోనేసియా, దక్షిణాఫ్రికా, ఫిలిప్పైన్స్ దేశాధ్యక్షులు కూడా హాజరవుతున్నారు. అలాగే, అబుదాబి రాజకుమారుడు, సౌదీ అరేబియా విదేశాంగ మంత్రి కూడా హాజరవుతారు. ప్రపంచలోని అగ్రదేశాలకు చెందిన నేతలు హాజరవుతున్నందున ఢిల్లీలో సదస్సు కోసం భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే నగరంలోని అనేక ఫైవ్ స్టార్ హోటళ్లను ప్రభుత్వం సిద్దం చేసింది. భద్రతా ఏర్పాట్లు కూడా భారీగాచేసింది.

# అక్రమ కేసులతో బీఆర్ఎస్‌ను భయపెట్టలేరు



ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. కార్యకర్తలు ఎవరూ అధై ర్యపడవద్దు, ధైర్యంగా ఉండాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ వెంట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. రేవంత్ రెడ్డికి దళితులపై నిజంగానే ప్రేమ ఉంటే.. దళిత గిరిజన డిక్లరేషన్‌లలో ఇచ్చిన హామీలు అమలు చేసి చూపించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.తెలంగాణను సాధించిన నాయకుడు కేసీఆర్‌ను చంపాలని, ఆయన చావాలని కోరుకుంటూ కాంగ్రెస్ గూండాలను రేవంత్ రెడ్డి పంపిస్తున్నాడని ధ్వజమెత్తారు. కేసీఆర్ చావును కోరుకుంటున్న రేవంత్ రెడ్డి.. నీ దిక్కుమాలిన రాజకీయాలను తెలంగాణ సమాజం మొత్తం గమనిస్తోందని..రేవంత్ రెడ్డికి ఏ సమయంలో ఎట్లా వాత పెట్టాలో తెలంగాణ సమాజానికి తెలుసునని కేటీఆర్ పేర్కొన్నారు.

# భావప్రకటన స్వేచ్ఛను హరిస్తే ఊరుకోం

- టీయుడబ్ల్యూజే ప్రదర్శనలో ముక్తఖంఠంతో హెచ్చరించిన జర్నలిస్టులు




**హైదరాబాద్, సెప్టెంబర్ 07:** దేశంలో భావాప్రకటన స్వేచ్ఛను, ప్రజాస్వామ్యాన్ని, మీడియా స్వేచ్ఛను హరించేందుకు పాలకులు ప్రయత్నిస్తే ప్రజాస్వామికావాదుల నుండి ప్రతిఘటన తప్పదని జర్నలిస్టులు హెచ్చరించారు.ఢిల్లీలో విధినిర్వహణలో ఉన్న మహిళా జర్నలిస్టులపై పోలీసుల దాడి, అక్రమ కేసు, అరెస్టును నిరసిస్తూ మంగళవారం సాయంత్రం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం(టీయుడబ్ల్యూజే) ఆధ్వర్యంలో జర్నలిస్టులు, ప్రజాస్వామికావాదులు కొవ్వొత్తులతో రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. బషీర్ బాగ్ లోని టీయుడబ్ల్యూజే కార్యాలయం నుండి ప్రాంభమైన ఈ నిరసన ప్రదర్శన, నిజాంకాలేజీ మీదుగా జగజీవన్ రాం విగ్రహం వరకు కొనసాగింది. అనంతరం టీయుడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ అధ్యక్షతన జరిగిన సభలో పలువురు సీనియర్ పాత్రికేయులు, ప్రజాస్వామికవాదులు ప్రసంగించారు. ప్రజాస్వామిక ఈ దేశంలో పౌరులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను, స్వేచ్ఛను ఖునీ చేస్తూ, తమకు అనుకూలమైన విధానాలను ఎన్డీయే ప్రభుత్వం అవలంబించడం అప్రజాస్వామికమని సీనియర్ పాత్రికేయులు, ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ మాజీ అధ్యక్షులు దేవులపల్లి అమర్ ఆందోళన వ్యక్తం చేసారు. ఐదు రోజుల క్రితం ఢిల్లీలో విధినిర్వహణ లో ఉన్న మైనారిటీ సామాజిక వర్గానికి చెందిన మహిళా జర్నలిస్టులు షాహిన్ ఖాన్, నఫీజా ఖాన్ లపై పోలీసులు దాడి చేయడం, వారిని అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో మీడియా స్వేచ్ఛను, జర్నలిస్టుల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని ఈ సభలో పాల్గొన్న పలువురు సూచించారు. జర్నలిస్టులపై దాడులు, బెదిరింపులు, అక్రమ అరెస్టులకు పాల్పడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని వారు అన్నారు. మహిళా జర్నలిస్టులకు న్యాయం చేయడంతో పాటు, ఘటనకు బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.ఈ ప్రదర్శనలో ఐజేయు స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎం.ఏ. మాజీద్, జాతీయ కార్యదర్శి వై. నరేందర్ రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులు కల్లూరి సత్యనారాయణ, కె. అజిత, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షురాలు అత్తలూరి అరుణ, టీయుడబ్ల్యూజే మహిళా జర్నలిస్ట్స్ విభాగం కన్వీనర్ రాజేశ్వరీ, ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాలు సంధ్య, సీనియర్ పాత్రికేయులు వనజ, స్వప్న, విమల, టీయుడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ. రాజేష్, బి. కిరణ్ కుమార్, హెచ్.యు.జే అధ్యక్షుడు శిగా శంకర్ గౌడ్, తెలంగాణ చిన్న, మధ్య తరగతి పత్రికల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యూసుఫ్ బాబు, అశోక్, ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.ఎన్.హరి, తెలంగాణ ఉర్దూ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి గౌస్ మోహియొద్దీన్ లతో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

# మీడియాపై ఆంక్షలు సరైంది కాదు

**ఆలోచనను విరమించుకోవాలి- TUWJ**



**హైదరాబాద్, సెప్టెంబర్ 07:** శాసన సభ సమావేశాల కవరేజికి వెళ్లే మీడియాపై ఆంక్షలు విధించడం సరైంది కాదని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (TUWJ) రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాం నారాయణలు అన్నారు. శాసన సభలో మీడియా ఒక భాగమనే విషయాన్ని మరచిపోవద్దని వారు పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియా పాత్రను మన రాజ్యాంగ పెద్దలు గుర్తించినందునే, చట్ట సభల్లో మీడియా కవరేజికి ఒక గ్యాలరీని రిపోర్ట్ చేయడానికి ఏర్పాటు చేయడం అందులో భాగమే అని వారు తెలిపారు. అవసరమైనప్పుడు ముఖ్యమంత్రిని, మంత్రులను, ఎమ్మెల్యేలను కలువడం కూడా ఆనవాయితీగా కొనసాగుతుం దన్నారు. అలాంటిది మన శాసన సభలో మీడియాపై ఆంక్షలు పెరుగుతున్నాయన్న భావన రావడం మంచిది కాదని వారు పేర్కొన్నారు. ఈ భావనను తొలగించడానికి గాను తగిన చర్యలు చేపట్టడానికి, శాసన సభ వ్యవహారాల మంత్రి డి.శ్రీధర్ బాబు వెంటనే చొరవ తీసుకొని, మీడియా అడ్వైజరీ కమిటీతో చర్చించి సమస్యను పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేసారు. ప్రజాస్వామ్యయుతంగా కార్యకలాపాలు నిర్వహించడానికి, మీడియా స్వేచ్ఛకి అడ్డంకులు ఉండబోవని, ప్రభుత్వ బాధ్యతలు చేపట్టిన వెంటనే ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఇచ్చిన భరోసాను ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నట్లు విరాహత్ అలీ, రాంనారాయణలు పేర్కొన్నారు.

# ఇద్దరు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలపై చర్యలకు అసెంబ్లీలో తీర్మానం

- స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలపై ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం..
- కఠిన చర్యలకు సిద్ధం



**హైదరాబాద్, సెప్టెంబర్ 07:** తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణల నేపథ్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిపై చర్యలకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఈ మేరకు మంత్రి దామోదర రాజ నర్సింహ అసెంబ్లీలో కీలక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.స్పీకర్‌పై ఎమ్మెల్సీలు చేసిన వ్యాఖ్యలతో పాటు అసెంబ్లీ ఆవరణలో బీఆర్ఎస్ సభ్యులు, నేతలు వ్యవహరించిన తీరుపై అధికార పక్షం తీవ్రంగా స్పం దించింది. అనుచిత వ్యాఖ్యలు చేసిన ఇద్దరు ఎమ్మె ల్సీలపై సభ తరఫున కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి తన తీర్మానంలో కోరారు. అలాగే అసెంబ్లీ ఆవరణలో జరిగిన ఘటనపై బీఆర్ఎస్ అధినేత, విపక్ష నేత కేసీఆర్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సభలో మాట్లాడిన దామోదర రాజనర్సింహ.. ఎస్సీల చరిత్ర కేవలం ఒక వర్గానికి సంబంధించినది కాదని, అది జాతి ఆత్మగౌరవానికి సంబంధించిన అంశమని అన్నారు. దళితుల చరిత్ర పోరాటం, ఆత్మగౌరవంతో ముడిపడి ఉందని పేర్కొన్నారు. ఆత్మగౌరవమే తమ అలంకార మని, అదే తమకు స్ఫూర్తి అని భావోద్వేగంతో వ్యాఖ్యానించారు.ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు జరిగితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని మంత్రి హెచ్చరించారు. తెలంగాణ యువతను, ముఖ్యంగా దళిత సమాజాన్ని తక్కువగా అంచనా వేయొద్దని సూచించారు. ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమే అయినప్పటికీ, రాజ్యాంగబద్ధ సంస్థలను, అత్యున్నత పదవుల్లో ఉన్న వారి హుందాతనాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు.స్పీకర్ స్థానం ఏ ఒక్క కులానికో, మతానికో చెందదని దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. అలాంటి రాజ్యాంగబద్ధమైన పీఠంపై ఉన్న వ్యక్తిని అవమానించడం క్షమించరాని విషయమని మండిపడ్డారు. అధికారంలో లేకపోయినా బీఆర్ఎస్ నేతల అహంకారం తగ్గలేదని విమర్శించారు. ప్రజా జీవితంలో ఉన్న నాయకులు మరింత బాధ్యతా యుతంగా వ్యవహరించాలని హితవు పలికారు. మంత్రి ప్రవేశపెట్టిన తీర్మానానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పూర్తిగా మద్దతు తెలిపారు. రాజ్యాంగ వ్యవస్థల పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయమని, అవసరమైన కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.తీర్మాన ప్రక్రియ పూర్తయిన అనంతరం ఎమ్మెల్సీలపై చర్యలకు సంబంధించిన అధికారిక తీర్మాన కాపీని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి పంపనున్నారు. అనంతరం శాసనమండలిలో తీర్మానానికి ఆమోదం లభించిన తర్వాత తదుపరి చర్యలు అమలు చేయనున్నారు.

# మహిళపై మళ్లీ దౌర్జన్యం..

- రోడ్డెక్కిన వివిధ వర్గాలు..
- ఉక్కుపాదం మోపిన సర్కార్
- ఆశా కార్యకర్తల ఆందోళనపై పోలీసుల ప్రతాపం
- బెనిఫిట్స్ కోసం గొంతెత్తిన ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు
- సర్కార్ ధోకాపై ల్యాండ్ సర్వేయర్ల అసెంబ్లీ ముట్టడి
- ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై విద్యార్థుల పోరాటం



**హైదరాబాద్, సెప్టెంబర్ 07:** ఆశా వర్కర్లపై ఉక్కుపాదం ఆశా వర్కర్లకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో చేపట్టిన 'చలో హైదరాబాద్' కార్యక్ర మాన్ని ఇందిరాపార్కు వద్ద పోలీసులు అడ్డుకున్నారు.ఆశా వర్కర్లకు, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. సీఐటీయూ నాయకులు, ఆశావర్కర్లు ఇందిరాపార్కు చౌరస్తా వద్ద బైఠాయించడంతో పోలీసులు అరెస్టు చేశారు.

# నిరంకుశ పాలనలో నిర్బంధకాండ

- తెల్లవారుజాము నుంచే బీఆర్ఎస్ నేతల ఇండ్లలోకి చొరబడిన పోలీసులు
- ఎమ్మెల్సీల అక్రమ అరెస్టులు.. దురుసు ప్రవర్తనలు..
- భగ్గుమన్న గులాబీ శ్రేణులు
- డైవర్షన్ పాలిటిక్స్‌కు పోలీసుల అండ !

**హైదరాబాద్, సెప్టెంబర్ 07:** కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టి దౌర్జన్యకాండకు దిగింది. మంగళవారం హైదరా బాద్‌లో అడుగడుగునా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. తెల్లవారుజామునే బీఆర్ఎస్ ఎమ్మెల్సీల ఇండ్లకు వెళ్లి తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిను అక్రమంగా అరెస్టు చేశారు. బీఆర్ఎస్ నాయకులు క్రిశాంక్ ఇంటికి వెళ్లి రౌడీయిజాన్ని ప్రదర్శించారు. ఎర్రవల్లి ఫామ్ హౌస్‌కు వెళ్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను అడ్డుకున్నారు. బీఆర్ఎస్ నాయకులపై దౌర్జన్యకాండకు దిగారు. పోలీసుల నోటికి అడ్డూ అదుపులేకుండా పోయింది. బీఆర్ఎస్ నేతలపై పరుష పదజాలాన్ని ఉపయోగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టి బీఆర్ఎస్ నాయకులను అడ్డుకోవడం, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే కేసీఆర్‌పై చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలను నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పలు పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదులు చేయడం, ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాస్తారోకో, ధర్నాలు, ఆందోళనలు చేయడంతో హైదరాబాద్ అట్టుడికింది. కాంగ్రెస్‌కు అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వ వైఫల్యాలను బీఆర్ఎస్ ఎండగుడుతుందనే భయం పట్టుకుం ది. ఇలాంటి సమయంలోనే నామ మాత్రంగా అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేసి.. మామ అన్పించేందుకు ప్రయత్నిస్తోందనే ఆరోపణలున్నాయి. ఇలాంటి సమయంలో అసెంబ్లీ వేదికగా బీఆర్ఎస్ తమను ప్రజా సమస్యలపై నిలదీస్తుందనే భయాందోళనకు గురైన కాంగ్రెస్ నేతలు డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపారని జకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. సోమవారం నుంచి బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను అసెంబ్లీకి రాకుండా అడ్డుతగులుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇందుకు కొనసాగింపుగా మంగళవారం కూడా హైదరాబాద్‌లో పోలీసులను ముందు పెట్టి బీఆర్ఎస్ శ్రేణులపై దౌర్జన్యకాండ సాగించారని ప్రజలు ఆరోపిస్తున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌రెడ్డిలను మంగళవారం ఉద యం అరెస్ట్ చేశారు. ఆ ఇద్దరి అరెస్ట్‌తో ఒక్కసారిగా బీఆర్ఎస్ శ్రేణుల్లో ఆగ్రహం కట్టలు తెచ్చుకుంది. ఎమ్మెల్సీల అరెస్ట్ విషయాన్ని తెలుసుకొని భారీ సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు నారాయణగూడ ఠాణాకు చేరుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల ఇండ్లపై పోలీసులు దాడులు చేసి ఎక్కడికక్కడ నిర్బంధించారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్ నివాసానికి కార్ఖానా సీఐ అనురాధ వెళ్లారు. క్రిశాంక్ ఇంట్లో లేరని, చిన్న పాప ఉందని ఆయన కుటుంబ సభ్యులు చెప్పినా వినకుండా ఇంట్లో పనిచేసే సిబ్బందిపై పరుషపదజాలంతో విరుచుకుపడ్డారు. ఆపై క్రిశాంక్‌పై దౌర్జన్యానికి దిగారు.

# విజయన్‌పై కేసు నమోదు చేయండి



**కుమార్తె, అల్లుడిపై కూడా..**

**కేరళ డీజీపీకి ఈడీ విజ్ఞప్తి**

**న్యూఢిల్లీ/కోచి, సెప్టెంబర్ 8:** కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్, ఆయన కుమార్తె టీ వీణా, అతని అల్లుడు పీఏ మహమ్మద్ రియాజ్‌లపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆ రాష్ట్ర డీజీపీకి మంగళవారం విజ్ఞప్తి చేసింది. విజయన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కొచ్చిన్ మినరల్స్ అండ్ రుటైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) అనే మైనింగ్ సంస్థ ఐటీ కన్సల్టెన్సీ సేవల ముసుగులో ఆయన కుమార్తె వీణాకు చెందిన ఎక్సలాజిక్ సొల్యూషన్స్ సంస్థ (ప్రస్తుతం మూతపడి ఉంది)కు రూ.2.88 కోట్లు అక్రమంగా చెల్లింపులు జరిపినట్టు ఈడీ ంది. మనీలాండరింగ్‌కు పాల్పడినట్టు ఆధారాలు లభ్యమైనందున వారిపై ఎఫ్ఐఆర్‌ను నమోదు చేయాలని డీజీపీని ఒక లేఖలో కోరింది.

# ఆశాల 'చలో హైదరాబాద్' ఉద్రిక్తం

### దోమలగూడ నుంచి ర్యాలీ.. ఇందిరాపార్కు సిగ్నల్ వద్ద ధర్నా



హైదరాబాద్, సెప్టెంబర్ 07: ఆశా వర్కర్లకు రూ.18వేల ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించాలంటూ తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపు నేపథ్యంలో ఆశాలు మంగళవారం చేపట్టిన 'చలో హైదరాబాద్' ఉద్రిక్తంగా మారింది. వారిపై రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధం ప్రయోగించింది. ఉదయం నుంచే ప్రధాన నాయకులు, కార్యకర్తలపై ఎక్కడికక్కడా నిర్బంధాలు, ముందస్తు అరెస్టులు చేసింది. అయినా అనేక ఆటంకాలను అధిగమించి వేలాదిమంది ఆశా వర్కర్లు చలో హైదరాబాద్ కు తరలివచ్చారు. దోమలగూడ నుంచి ర్యాలీగా బయలుదేరి ఇందిరాపార్కు సిగ్నల్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే ఆశాలకు రూ.18 వేల వేతనం నిర్ణయించాలనీ, ఇతర డిమాండ్స్ అన్నింటినీ పరిష్కరించాలనీ, పోలీసుల జులుం ఆపాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ క్రమంలో ఆశా వర్కర్లకు, పోలీసులకు మధ్య చాలాసేపు పెద్ద ఎత్తున ఘర్షణతో పాటు తోపులాటలు జరిగాయి. అనంతరం అరెస్టులు చేశారు. చాలా మంది ఆశాలకు గాయాలయ్యాయి. కొందరు స్పృహ తప్పి పడిపోయారు. ఈ సందర్భంగా ఆశా యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షులు పి.జయలక్ష్మి మాట్లాడుతూ.. ఒకవైపు ప్రజాపాలన అంటూనే మరోవైపు నిర్బంధ పాలన కొనసాగించడం సరికాదన్నారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద ధర్నా చేసుకునే అవకాశం కల్పించాలని ఈ నెల 4న పోలీసులను అనుమతి కోరినా.. అనుమతి ఇవ్వకపోగా నిర్బంధాన్ని ప్రయోగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఉదయమే సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్వీ రమ, తదితర నాయకులను, వేలాది మంది ఆశా వర్కర్లను పోలీసులు ముందస్తు అరెస్టులు చేయటంతోపాటు అన్ని చోట్ల తీవ్రమైన నిర్బంధాన్ని ప్రయోగించిందన్నారు. నిర్బంధాలతో పోరాటాలను ఆపలేరని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు నిర్ణయించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. పని భారం తగ్గించాలని కోరారు. ప్రభుత్వం నుంచి సానుకూల ప్రకటన వెలువడకపోతే ఫిక్స్‌డ్ వేతనం అమలయ్యే వరకు ఈ పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఆగస్టు 14న ప్రజావాణిలో ఇచ్చిన వినతి పత్రంలోని డిమాండ్స్ అన్నింటినీ పరిష్కరించాలని, లేదంటే ఆశా వర్కర్లందరూ నిరవధిక సమ్మెకు సిద్ధమవుతారని హెచ్చరించారు. ప్రభుత్వ నిర్బంధాన్ని నిరసిస్తూ నేడు రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఆర్.నీలాదేవి, కోశాధికారి పి.గంగమణి, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శులు జె.వెంకటేశ్, పాలడుగు సుధాకర్, హైదరాబాద్ సెంట్రల్ కమిటీ సీఐటీయూ జిల్లా అధ్యక్షులు దశరథ, సౌత్ కమిటీ జిల్లా అధ్యక్షురాలు మీన, ఆశా రాష్ట్ర నాయకులు శ్రీలత, యశోద, రేవతి, బాలమణి, సావిత్ర, ప్రవీణ, శ్రావ్య, రాజమణి, స్వరూప, అనిత, అమృత, మంగ పాల్గొన్నారు



# ప్రధాని మోదీ కార్యక్రమంలో భద్రతా వైఫల్యం

### నకిలీ పీఎంవో అధికారి, బాడీగార్డ్ అరెస్ట్

ముంబై: ప్రధాని మోదీ పాల్గొనే కార్యక్రమం వేదికపై ఒక వ్యక్తిని ముంబై పోలీసులు అరెస్ట్ చేశారు. తాను ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంవో) అధికారి అని అతను చెప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. అతనితోపాటు అతని బాడీగార్డ్‌నని చెప్పుకున్న తుపాకీ కలిగివున్న మరో వ్యక్తిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాంద్రా కుర్లా కాంప్లెక్స్ పోలీసులు విడుదల చేసిన ప్రకటన ప్రకారం.. రోహన్ పారేఖ్‌గా గుర్తించిన వ్యక్తి తాను పీఎంవో అధికారి అని చెప్పుకున్నాడు. మరో వ్యక్తి తాను రోహన్ పారేఖ్ బాడీగార్డునని చెప్పుకున్నాడు.

# కాంగ్రెస్ మూకలను తరిమిన గ్రామస్తులు

- అసెంబ్లీ నుంచి ఎర్రవల్లి దాకా రేవంత్ సేన వీరంగం
- అడుగడుగునా అడ్డుకొని ఉరికించిన ప్రజాగ్రహం
- ఎదురుతన్నిన డైవర్షన్.. 8 గంటలు హైటెన్షన్
- కాంగ్రెస్ ఎమ్మెల్యేల నాయకత్వంలో మాజీ సీఎం నివాసం వైపు దూసుకొచ్చిన కిరాయి ముఠాలు
- గూండాలకు ఎస్కార్ట్ ఇచ్చి మరీ నడిపిన ఖాకీలు
- కేసీఆర్ కోసం రోడ్డుమీదికి వచ్చిన అభిమానులు
- రక్షణ కవచంగా నిలిచిన ఎర్రవల్లి పరిసర పల్లెలు
- వచ్చినవారిని వచ్చినట్టు తన్నితరిమిన ప్రజలు
- తోపులాటలో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డికి దెబ్బలు
- పోలీసుల రక్షణలో కాంగ్రెస్ ఎమ్మెల్యేల పరుగులు




హైదరాబాద్, సెప్టెంబర్ 07: అసెంబ్లీలో ప్రతిపక్షాన్ని నేరుగా ఎదురొనే దమ్ములేక, హామీలపై నిలదీస్తున్న గులాబీ దళానికి రాజకీయంగా బదులు ఇవ్వలేక రేవంత్ ప్రభుత్వం ప్రత్యక్ష దాడులకు దిగింది. మొన్న అసెంబ్లీ సాక్షిగా మహిళా ఎమ్మెల్యేలను అవమానించిన రేవంత్‌రెడ్డి బలగం.. మంగళవారం మరో దారుణానికి ఒడిగట్టింది. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి, పదేండ్లపాటు ప్రగతి పథంలో నడిపించిన ఉద్యమ నేత, మాజీ ముఖ్యమంత్రి ఎర్రవల్లిలోని కేసీఆర్ నివాసంపై దాడికి తెగబడే దుస్సాహసం చేసింది. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అధికారిక క్యాంప్ కార్యాలయం నుంచే వందలాది మంది కాంగ్రెస్ కార్యకర్తల ముసుగుతో కిరాయి మూకలు దాడికి వాహనాల్లో బయలుదేరారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, గజ్వేల్ నేత నర్సారెడ్డి వంటి కాంగ్రెస్ నాయకులు బాహాటంగా రౌడీషీటర్లను వెంటేసుకొని ఈ దాడి యత్నానికి నాయకత్వం వహించారు. కేసీఆర్ నివాసానికి వెళ్లే మార్గాల్లో 144 సెక్షన్ విధిస్తున్నామని ప్రకటించిన పోలీసులు, కాంగ్రెస్ గూండాల వాహన శ్రేణులకు మాత్రం పచ్చజెండా ఊపడమే గాక స్వయంగా దారి చూపిస్తూ ఎస్కార్ట్‌తో సాగనంపడం ప్రజలను నివ్వెరపరిచింది. జరుగబోతున్న కుట్రను పసిగట్టిన ఎర్రవల్లి చుట్టుపక్కల పల్లెలు అప్రమత్తం అయ్యాయి. కేసీఆర్ నివాసం మీదికి దాడికి వెళ్తున్నాయని పసిగట్టిన ప్రజలు ఇండ్ల నుంచి బయటికి వచ్చారు. నిమిషాల్లో చౌరస్తా వద్ద గుంపై, ఏ ఊరుకు ఆ ఊరు ఉప్పెనలా కదిలి పొలిమేరలో కాపు కాశారు. వారికి బీఆర్ఎస్ శ్రేణులు కూడా తోడయ్యాయి. కర్ర, కట్టె, పొరక, చెప్పు, రాయి ఏది దొరికితే అది అందుకొని రౌడీ మూకలను పొలిమేర దాటించారు. ప్రజల ఎదురుదాడిని చూసి పోలీసులు సైతం ఆశ్చర్యపోవటం గమనార్హం.




# ప్రపంచ సంక్షోభాల్లోనూ భారత్ ఆర్థిక ప్రగతి




ముంబై: ప్రపంచవ్యాప్తంగా యుద్ధ వాతావరణం, ఘర్షణలు, వాణిజ్య ఒత్తిళ్లు, చమురు--ఎనర్జీ సరఫరాలో అంతరాయాలు కొనసాగుతున్నప్పటికీ భారత్ ఆర్థికంగా శక్తివంతమైన వృద్ధిని సాధిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఏప్రిల్--జూన్ త్రైమాసికంలో భారత ఆర్థిక వ్యవస్థ 7.8 శాతం వృద్ధిని నమోదు చేసిందని తెలిపారు. ముంబైలో జరుగుతున్న గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్--2026లో మంగళవారం ఆయన ప్రసంగించారు. ప్రపంచంలోని అనిశ్చిత పరిస్థితుల మధ్య భారత ఆర్థిక ప్రగతి ఇతర దేశాల్లో కొత్త ఆశలను చిగురింపజేస్తోందని మోదీ పేర్కొన్నారు. భారత్ సాధించిన ఆర్థిక పురోగతి దేశ సామర్థ్యాన్ని చాటుతోందన్నారు. సాంకేతికతను ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకురావడం ద్వారా డిజిటల్ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతమవుతోందని తెలిపారు.

**యూపీఐకి పదేళ్లు..** యూపీఐ సేవలు ప్రారంభమై పదేళ్లు పూర్తయిన సందర్భంగా మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రస్తుతం 11 దేశాల్లో యూపీఐ సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇతర దేశాల చెల్లింపు వ్యవస్థలతో యూపీఐని అనుసంధానం చేయడమే తదుపరి లక్ష్యంగా ఉండాలని ఫిన్‌టెక్ రంగానికి పిలుపునిచ్చారు. మారుమూల ప్రాంతాల్లోని ప్రజలకు సైతం డిజిటల్ చెల్లింపులు అందుబాటులోకి రావడం యూపీఐ విజయానికి నిదర్శనమన్నారు. యూపీఐ కేవలం సాంకేతికతకు సంబంధించిన అంశం మాత్రమే కాదని, అది ఒక నాగరికతకు సంబంధించిన అంశమని మోదీ వ్యాఖ్యానించారు. గత పదేళ్లలో ఫిన్‌టెక్ రంగం గణనీయంగా విస్తరించడంతో కోట్లాది మంది ప్రజలు డిజిటల్ ఆర్థిక వ్యవస్థలోకి ప్రవేశించారని తెలిపారు.


**ఇతర రంగాల్లోనూ ఫిన్‌టెక్ విస్తరణ..** ఫిన్‌టెక్ రంగం కేవలం డిజిటల్ చెల్లింపులకే పరిమితం కాకుండా రుణాలు, పొదుపులు, పెన్షన్లు, బీమా వంటి రంగాల్లోనూ సాంకేతికత వినియోగాన్ని పెంచాలని ప్రధాని సూచించారు. ప్రజల ఆర్థిక సాధికారతకు ఫిన్‌టెక్ మరింత కీలకంగా మారాలని ఆకాంక్షించారు.

# తొలిసారి ఖసెమ్ బసీర్ క్షిపణిని ప్రయోగించిన ఇరాన్



టెహ్రాన్ : ఈ నెల ఐదు, ఆరు తేదీలలో హార్ముజ్ జలసంధిలో అమెరికా నౌకలను లక్ష్యంగా చేసుకొని ఇరాన్ సేనలు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిన విషయం తెలిసిందే. తొలిసారి నౌకా విధ్వంసక ఖసెమ్ బసీర్ బాలిస్టిక్ క్షిపణుల ప్రయోగాలకు సంబంధించిన వీడియోలను ఐఆర్‌జీసీ తాజాగా విడుదల చేసింది. అణుశక్తితో నడిచే విమాన వాహక నౌకతో పాటు ఓ డిస్ట్రాయర్‌ను కూడా ధ్వంసం చేశామని ఇరాన్ తెలిపింది. ఖసెమ్ బసీర్ క్షిపణికి ఖుద్స్ దళాల నాయకుడైన ఐఆర్‌జీసీ మాజీ జనరల్ ఖసెమ్ సులేమని పేరు పెట్టారు. 2020లో ఆయన అమెరికా డ్రోన్ దాడిలో చనిపోయారు. తాజాగా ఇరాన్ దానిని మొదటిసారి యుద్ధభూమిలో ప్రయోగించింది. కాగా అమెరికా నౌకలను లక్ష్యంగా చేసుకొని దాడి చేసే సామర్థ్యం, సాంకేతికత తమ వద్ద ఉన్నాయని ఇరాన్ తాత్కాలిక రక్షణ మంత్రి మజీద్ ఎబ్న్ అల్-రెజా హెచ్చరించారు.

# చమురు ధరలు తగ్గేది అప్పుడే.. ట్రంప్ సంచలనం



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 07: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఏమాత్రం తగ్గడం లేదు. ఇరాన్-అమెరికా మధ్య యుద్ధ వాతా వరణం కొనసాగుతూనే ఉంది. ప్రపంచ వాణిజ్యానికి కీలకమైన హార్మూజ్ జలసంధి విషయంలో ఇరు దేశాల మధ్య ఆధిపత్య పోరు జరుగుతోంది. హార్మూజ్ జలసంధి తమ నియంత్రణలోనే ఉందని అమెరికా స్పష్టం చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే తాజాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. యుద్ధంలో ఇరాన్ పై అమెరికా విజయం సాధిస్తే చమురు ధరలు తగ్గుముఖం పడతాయని అన్నారు. గత ఐదు రోజులుగా ప్రపంచ వాణిజ్య మార్కెట్ లో ముడి చమురు ధరలు ఒక్కసారిగా పెరుగుతూ పోతున్నాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ పై అమెరికా విజయం సాధిస్తే అమెరికాలో పెట్రోల్ ధరలు ఒక్కో గ్యాలన్ పై 2 డాలర్ల వరకు తగ్గుముఖం పడతాయని అంచనా వేశారు. ఈ మేరకు తన సొంత సామాజిక మాధ్యమం అయిన ట్రూత్ సోషల్ లో ట్రంప్ పోస్టు పెట్టారు. చమురు ధరలు ప్రస్తుతం గణనీయంగా పెరుగుతున్నాయని.. ప్రస్తుతం పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం కారణంగానే ధరలు పెరుగుతున్నాయన్నారు. ఇరాన్ - అమెరికా మధ్య యుద్ధం ఆగిపోతే అంతర్జాతీయ చమురు మార్కెట్లలో స్థిరత్వం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. చమురు ధరలు తగ్గుముఖం పడతాయి. ఎన్నడూ లేని విధంగా చమురు ధరలు తగ్గుతాయి. ఇరాన్ తో మనం యుద్ధం గెలిచాక ఆ మార్పు కనిపిస్తుంది. ఒక్కో గ్యాలన్ పై మూడు డాలర్లు.. లేదా రెండు డాలర్లు మేర తగ్గుతాయి. అలాగే ఇరాన్ వద్ద అణ్వాయు ధాలను లేకుండా చేస్తాం. ఇది త్వరగానే జరుగుతుంది. ఇరాన్ వద్ద ఇక ఎప్పటికీ అణ్వాయుధాలు లేకుండా చేస్తాం" అని ట్రంప్ స్పష్టం చేశారు. చమురు ధరలు సోమవారం రోజున ఆరు వారాల గరిష్టానికి చేరుకున్నాయి.

**హార్మూజ్ జలసంధి కీ పాయింట్**

గా ఇరాన్- అమెరికా మధ్య యుద్ధ వాతావరణం నేపథ్యంలో చమురు ధరల్లో గణనీయంగా మార్పు కనిపిస్తోంది. బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధరల ప్రకారం.. ఒక్కో బ్యారెల్ ఇప్పుడు 97 డాలర్లుగా ఉంది. గత ఐదు రోజుల్లోనే ఈ ధర 9 శాతం పెరిగింది. గత నెల రోజులుగా ఇది 19 శాతం పెరిగింది. ఇక అంతకుముందు ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాఘేర్ గాలీబఫ్ మాట్లాడుతూ.. అమెరికాకు కీలక వార్నింగ్ ఇచ్చారు. ఇరాన్ లోని పరిశ్రమలు, ఎనర్జీ మౌలిక వసతులపై దాడులకు పాల్పడితే ప్రతి దాడులు తీవ్రంగా ఉంటాయని వార్నింగ్ ఇచ్చారు. అటు అమెరికా కూడా ఇరాన్ పై సంచలన హెచ్చరికలు జారీ చేస్తోంది. ఈ నేపథ్యంలో పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకున్నాయి.

# హియరింగ్‌కు గుర్తింపు కార్డుతో హాజరు కావాలి

**-నోటీసులు అందుకున్న ఓటర్లు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో రావాలి**

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

బలగం టీవీ,ముస్తాబాద్:

ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణలో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్లు హియరింగ్‌కు ఎన్నికల సంఘం గుర్తించిన 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకదానితో పాటు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో తప్పనిసరిగా హాజరు కావాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. మంగళవారం ముస్తాబాద్ మండలం చీకోడులో నిర్వహించిన హియరింగ్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా మండలంలో నో మ్యాపింగ్, అనామలీస్ ఓటర్లు ఎంతమంది ఉన్నారు, కొత్త ఓటర్లుగా ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మండలంలో మొత్తం 7,005 మంది నో మ్యాపింగ్, అనామలీస్ ఓటర్లకు నోటీసులు జారీ చేసినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం ఆయా గ్రామాల్లో హియరింగ్ సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. నోటీసులు అందుకున్న ఓటర్లకు బూత్ స్థాయి అధికారులు సమాచారం అందించి, ప్రతి ఒక్కరూ హియరింగ్‌కు హాజరయ్యేలా చూడాలన్నారు. ఎన్నికల సంఘం గుర్తించిన 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకదాన్ని తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు.తహసీల్దార్లు, బూత్ స్థాయి అధికారి పర్యవేక్షకులు క్షేత్రస్థాయిలో ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ ప్రక్రియను పర్యవేక్షించాలని ఆదేశించారు. బూత్ స్థాయి అధికారులు ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని సూచించారు.




**12, 13 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు**

ఈ నెల 12, 13 తేదీల్లో ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటరు నమోదు ప్రత్యేక ప్రచార కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఓటరు నమోదు అధికారులు, సహాయ ఓటరు నమోదు అధికారుల కార్యాలయాల్లో క్లెయిమ్‌లు, అభ్యంతరాలతో పాటు ఫారం-6, ఫారం-7, ఫారం-8 ద్వారా దరఖాస్తులు సమర్పించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీధర్‌బాబు, తహసీల్దార్ ఫారూఖ్, ఎంపీడీవో లచ్చాలు తదితరులు పాల్గొన్నారు.

# భూముల రీ సర్వే ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలి..

**-అదనపు కలెక్టర్ గడ్డం నగేష్**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:



జిల్లాలో భూముల రీ సర్వే ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు.

భూముల రీ సర్వే, ఎస్ ఐ ఆర్ ప్రక్రియ, ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలు కోసం ఏర్పాట్లు తదితర అంశాలపై అదనపు కలెక్టర్ మంగళవారం అదనపు కలెక్టర్ జిల్లాలోని ఆర్డీవోలు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులు, తహసీల్దార్లతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. షెడ్యూల్ ప్రకారం రీ సర్వే పనులు పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులు సంయుక్తంగా సర్వేను పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రత్యేక ఓటర్ సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలు కోసం కావలసిన ఏర్పాట్లపై ప్రణాళిక సిద్ధం చేయాలని, దీనికి సంబంధించిన అన్ని అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. అన్ని అంశాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, నిర్ణీత గడువులోగా పూర్తి చేయించాలని ఆదేశించారు.

# ఆయిల్ పామ్‌తో రూ.3.45 లక్షల ఆదాయం



**నామాపూర్ రైతు చంద్రశేఖర్‌రావును అభినందించిన కలెక్టర్ గరిమ అగ్రవాల్**

బలగం టీవీ, ముస్తాబాద్ :

ఆయిల్ పామ్ సాగుతో రైతులు దీర్ఘకాలికంగా మంచి ఆదాయం పొందవచ్చని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. ముస్తాబాద్ మండలం నామాపూర్‌కు చెందిన రైతు అరవెల్లి చంద్రశేఖర్‌రావు సాగు చేస్తున్న ఆయిల్ పామ్ తోటను మంగళవారం కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

చంద్రశేఖర్‌రావు సుమారు నాలుగేళ్ల క్రితం ఏడు ఎకరాల్లో ఆయిల్ పామ్ మొక్కలు నాటారు. సస్యరక్షణ చర్యలు, నీటి యాజమాన్యాన్ని పాటిస్తూ సాగు చేయడంతో ఇప్పటివరకు 15 టన్నుల దిగుబడి సాధించి రూ.3.45 లక్షల ఆదాయం పొందారు. ప్రస్తుతం మరో రెండు ఎకరాల్లో మామిడి, నిమ్మ తోటలను కూడా సాగు చేస్తున్నారు.

తోటను పరిశీలించిన కలెక్టర్ మొక్కల పెరుగుదల, దిగుబడి, పెట్టుబడి, డ్రిప్ సౌకర్యం, మొక్కల సమీకరణ, సస్యరక్షణ చర్యలపై రైతును అడిగి తెలుసుకున్నారు. తదుపరి దిగుబడి ఎప్పుడు చేతికి వస్తుందని ఆరా తీశారు. మంచి దిగుబడి సాధిస్తున్న రైతును అభినందించారు.

ఆయిల్ పామ్‌తో దీర్ఘకాలిక ఆదాయం

ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ రైతులు దీర్ఘకాలిక ఆదాయం అందించే ఆయిల్ పామ్ సాగు వైపు దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న మొక్కలు, డ్రిప్ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మొదటి మూడు సంవత్సరాల్లో అంతర పంటలుగా ఉద్యాన శాఖ అధికారుల సూచనల మేరకు కూరగాయలు, పూలు, పండ్ల మొక్కలను సాగు చేసుకుని అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు.ఆయిల్ పామ్ సాగులో కోతుల బెడద, చీడపీడల సమస్యలు తక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. ప్రస్తుతం టన్ను ఆయిల్ పామ్ ధర రూ.24,025గా ఉందన్నారు. జిల్లాలో నామాపూర్, బోయినపల్లి, నేరెళ్ల, సిరిసిల్లలో సేకరణ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. ఇక్కడి నుంచి ఉత్పత్తులను సిద్ధిపేట జిల్లా నర్మెట్టలోని ఆయిల్ పామ్ కర్మాగారానికి తరలిస్తున్నట్లు తెలిపారు.

జిల్లాలో మరింత మంది రైతులు ఆయిల్ పామ్ సాగుకు ముందుకు వస్తే అదనపు సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. ఆయిల్ పామ్‌తో పాటు మామిడి, నిమ్మ వంటి ఉద్యాన పంటలను సాగు చేయడం ద్వారా రైతులకు మరింత ఆదాయం సమకూరుతుందని పేర్కొంటూ, రైతులు ఆయిల్ పామ్ సాగు వైపు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శరత్‌బాబు, ఏడీఏ ప్రదీప్, తహసీల్దార్ ఫారూఖ్, ఎంపీడీవో లచ్చాలు తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే శంకర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలి

బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌పై షాద్‌నగర్ ఎమ్మెల్యే ఈర్లపల్లి శంకర్ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారంటూ బీఆర్ఎస్ జిల్లా నాయకులు ఎస్పీ మహేష్ బి. గితే కి బీఆర్ఎస్ జిల్లా సమన్వయకర్త, మాజీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ఆధ్వర్యంలో ఫిర్యాదు అందజేశారు. సోషల్ మీడియా, వీడియో ఆధారాలను పరిశీలించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధ్యతాయుతమైన ప్రజాప్రతినిధిగా ఉండి ఇలాంటి వ్యాఖ్యలు చేసినందుకు ఎమ్మెల్యే శంకర్ శాసనసభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇటువంటి వ్యాఖ్యలు శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉందని పేర్కొంటూ నిష్పాక్షిక విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.ఎమ్మెల్యే శంకర్‌తో పాటు ఆయనను ప్రోత్సహించారంటూ సీఎం రేవంత్‌రెడ్డిపై కూడా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.ఇక్కడ రాష్ట్ర కార్యదర్శి గూడూరు ప్రవీణ్, మాజీ జెడ్పి చైర్మన్ తుల ఉమా, కుంభాల మల్ రెడ్డి ఉన్నారు.

# హామీలు అమలు చేయకుంటే ప్రజల ఆగ్రహం తప్పదు..

**-బీఆర్ఎస్ అధ్యక్షుడు తోట ఆగయ్య..**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగన్న ఆరోపించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు సెప్టెంబర్ 1 నుంచి చేపట్టిన నిరసన కార్యక్రమాల ముగింపు సందర్భంగా మంగళవారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిరసన చేపట్టారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం బీ ఆర్ఎస్ భవన్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో తోట ఆగయ్య మాట్లాడుతూ.. వారం రోజులుగా పట్టణాలు, గ్రామాల్లో నిర్వహించిన నిరసన కార్యక్రమాలకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయడంలో విఫలమైందనే విషయాన్ని ప్రజల ముందుకు తీసుకెళ్లామని తెలిపారు. హామీలను అమలు చేసి ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

నిరసనల చివరి రోజున ఆరు గ్యారంటీలు, 420 హామీలతో పాటు ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంబేద్కర్‌కు వినతిపత్రం అందజేశామని,ప్రభుత్వానికి కనువిప్పు కలిగి, ఇచ్చిన హామీలను అమలు చేసేలా జ్ఞానోదయం కలగాలని కోరుకున్నామన్నారు.

బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను అడ్డుకోవడం దారుణం

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసెంబ్లీకి రాకుండా పోలీసులు అడ్డుకోవడం దారుణమని అన్నారు . మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు దురుసుగా వ్యవహరించడాన్ని తీవ్రంగా ఖండించారు. పోలీసులు పాశవికంగా వ్యవహరించారని ఆరోపించారు. మహిళా ప్రజాప్రతినిధుల పట్ల అనుచితంగా వ్యవహరించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఇచ్చిన హామీలను అమలు చేస్తే మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అసెంబ్లీకి వస్తారని, దమ్ముంటే హామీలన్నింటినీ



అమలు చేసి చూపించాలని ప్రభుత్వానికి సవాల్ విసిరారు. అసెంబ్లీ సమావేశాలు ప్రజాస్వామ్యబద్ధంగా జరగాల్సిన సమయంలో కౌరవుల సభను తలపించేలా పరిస్థితులు ఉన్నాయని అన్నారు .

కేసీఆర్‌ను చావాలని కోరుకున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేల వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. కేసీఆర్‌పై ఈగ వాలినా తెలంగాణ సమాజం ఊరుకోదని హెచ్చరించారు. వారం రోజుల పాటు నిర్వహించిన నిరసన కార్యక్రమాల్లో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో నాఫ్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, రాష్ట్ర కార్యదర్శి గూడూరు ప్రవీణ్, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, మున్సిపల్ చైర్మన్ జిందం కళా చక్రపాణి, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, మండలాల పార్టీ అధ్యక్షులు, సెస్ డైరెక్టర్లు, ప్యాక్స్ చైర్మన్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమం

**-అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, కొత్త ఆసరా పింఛన్లు**

**-కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు పర్ష హన్మాండ్లు**

బలగం టీవీ, గంభీరావుపేట:

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు పర్ష హన్మాండ్లు అన్నారు. మంగళవారం శ్రీగాధ గ్రామంలో వేముల స్వరూప, కాశాగౌడ్ దంపతుల ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో పర్ష హన్మాండ్లు పాల్గొని రిబ్బన్ కట్ చేసి ఇంటిని ప్రారంభించారు.

ఈ సందర్భంగా పర్ష హన్మాండ్లు మాట్లాడుతూ .. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు, కొత్త ఆసరా పింఛన్లు మంజూరు చేయించేందుకు కృషి చేస్తామని అన్నారు. గతంలో సొంత ఇల్లు లేక గుడిసెల్లో, శిథిలావస్థకు చేరిన ఇళ్లలో, అద్దె ఇళ్లలో ఏళ్ల తరబడి ఇబ్బందులు పడిన పేదలకు ఇందిరమ్మ ఇళ్లతో సొంతింటి కల నెరవేరుతోందన్నారు. సొంత ఇంటిని నిర్మించుకుని ఆత్మగౌరవంతో సంతోషంగా జీవిస్తున్నారని పేర్కొన్నారు.ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మెజారిటీ హామీలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు . భవిష్యత్ నగరం, క్రీడా విశ్వవిద్యాలయం, తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు వంటి నూతన కార్యక్రమాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టారని అన్నారు. ప్రజలకు మంచి చేసే వారిని గుర్తించి ఆదరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బందెల రాజు, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కల్వకుంట్ల లక్ష్మణ్‌రావు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు వేముల శ్రీనివాస్‌గౌడ్, తొండ్ల దేవేంద్ర నర్సయ్య, సుద్దాల రాజమణి మల్లేశ్, వార్డు సభ్యులు వేముల పర్షాగౌడ్, వేముల దేవరాజుగౌడ్, నాయకులు తొండ్ల నర్సిములు, కరికె ఉదయ్, వేముల యాదగౌడ్, గొట్టెముకుల వెంకటస్వామి, సిద్ధాగౌడ్, గంగాగౌడ్, కాశాగౌడ్, రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# హామీలను తుంగలో తొక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం

**-యూరియా యాప్‌లో కాదు.. దుకాణాల్లో అందించాలి**

బలగం టీవీ,ఇల్లంతకుంట:

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని ఆరోపిస్తూ ఇల్లంతకుంట మండలం అనంతారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు నిరసన తెలిపారు. మాజీ సర్పంచ్ బొల్లం వెంకటేశం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా బొల్లం వెంకటేశం మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సబ్బండ వర్ణాల అభివృద్ధే లక్ష్యంగా పాలన కొనసాగిందన్నారు. ప్రస్తుతం రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా కోసం రైతులు అనేక అవస్థలు పడుతున్నారని, యూరియాను యాప్‌లలో నమోదు చేయడం కాకుండా నేరుగా దుకాణాల్లో అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.

రైతులకు అవసరమైన సమయంలో ఎరువులు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వొల్లాల రవీందర్, మున్నూరు కాపు సంఘం మాజీ అధ్యక్షుడు ఆకుల శ్రీను, గ్రామ శాఖ మాజీ అధ్యక్షుడు ఎలుక రాజయ్య, సీనియర్ నాయకులు గరిగే సత్యనారాయణ, బట్టి నర్సయ్య, దారవేణి శ్రీను, పురుషోత్తం భాస్కర్, దారవేణి నాగరాజు, బొల్లం పరశురామ్, ఎలుక నర్సయ్య, రాజు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఆప్తుడిని కోల్పోయిన కుటుంబానికి ఆపన్నహస్తం..



**కడసారి క్రతువును భుజాన వేసుకున్న పాలకవర్గం**

బలగం టీవీ,ఎల్లారెడ్డిపేట:

ఆప్తుడిని కోల్పోయి కన్నీటి సంద్రంలో ఉన్న కుటుంబానికి గ్రామ పాలకవర్గం అండగా నిలిచింది. ఆర్థిక ఇబ్బందులతో అంత్యక్రియలు నిర్వహించలేని పరిస్థితిలో ఉన్న కుటుంబానికి ఆపన్నహస్తం అందిస్తూ మానవత్వాన్ని చాటుకుంది.

ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి గ్రామానికి చెందిన జనగామ సతీష్ గత 15 రోజుల క్రితం పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తీవ్రంగా గాయపడిన ఆయనను కుటుంబ సభ్యులు వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం చికిత్స పొందుతూ సతీష్ మృతి చెందాడు.

సతీష్ మృతితో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఒకవైపు ఆప్తుడిని కోల్పోయిన బాధ, మరోవైపు అంత్యక్రియలు నిర్వహించేందుకు చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది. విషయం తెలుసుకున్న రాచర్ల గొల్లపల్లి గ్రామ సర్పంచ్ కొండ రమేష్‌గౌడ్, ఉప సర్పంచ్ పొన్నాల మనెమ్మ, వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బంది వెంటనే స్పందించారు.

కుటుంబానికి అండగా నిలిచిన పాలకవర్గం అంత్యక్రియలకు అవసరమైన పూర్తి ఖర్చులను భరించడంతో పాటు దగ్గరుండి ఏర్పాట్లు చేసింది. కుటుంబ సభ్యులతో కలిసి కడసారి క్రతువును నిర్వహించడంలో సహకరించి మానవత్వాన్ని చాటుకుంది.

మృతుడు సతీష్‌కు భార్య మమత, పిల్లలు విగ్నేష్, పావనిశ్రీ ఉన్నారు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న సతీష్ మృతితో భార్య, పిల్లలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని, ప్రభుత్వం స్పందించి ఆ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని సర్పంచ్ కొండ రమేష్‌గౌడ్, పాలకవర్గ సభ్యులు కోరారు.

ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పొన్నాల మనెమ్మ, వార్డు సభ్యులు అరుణజ్యోతి, గాంతుల సతీష్, పొన్నాల హరీష్, వెంకటేష్‌రెడ్డి, కొండ సాయి, దాసరపు అశోక్, అందే సామ్యూల్, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు..



# మాజీ సీఎం కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు.

## ఎమ్మెల్యే ఈర్ల శంకర్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి.

బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మృతి చెందాలని వ్యాఖ్యలు చేసిన శాసనసభ్యులు ఈర్ల శంకర్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు ఎల్లారెడ్డిపేట ఎస్సై రమేష్ కు ఫిర్యాదు చేశారు.

ఈ సందర్భంగా ఫ్యాక్స్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్‌పై ఎమ్మెల్యే ఈర్ల శంకర్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నాయని అన్నారు. ప్రజా జీవితంలో ఉన్న వ్యక్తి మరో ప్రజా నాయకుడిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం బాధ్యతారాహిత్యమని పేర్కొన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు ప్రజల్లో ఉద్రిక్తతలకు దారితీసే అవకాశం ఉన్నందున పోలీసులు సమగ్రంగా విచారణ జరిపి, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతం కాకుండా సంబంధిత వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీకి సమర్పించిన ఫిర్యాదులో కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




## కాంగ్రెస్ పాలనకు ప్రజలే చరమగీతం పాడాలి

### -ప్రజాపాలన కాదు.. రాక్షస పాలన:

### -చల్మెడ లక్ష్మీనరసింహారావు

బలగం టీవీ, వేములవాడ :

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు ఆరోపించారు. వేములవాడలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సుమారు 500 మంది మహిళలు, మహిళా కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. పద్మశాలి భవన్ నుంచి ప్రధాన రహదారి మీదుగా ఆలయ పురవీధుల గుండా ర్యాలీ కొనసాగింది. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా చల్మెడ లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ప్రశ్నించేందుకు నల్ల టీషర్టులు ధరించి అసెంబ్లీకి వెళ్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, పలువురు ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకుని అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. ముఖ్యంగా మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు తీవ్రంగా ఖండించాల్సిన విషయమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును కాలరాయడం అప్రజాస్వామిక వైఖరికి నిదర్శనమన్నారు. ప్రజల కోసం ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తారా, ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపితే అడ్డుకుంటారా అని ప్రశ్నించారు.

ప్రజల గొంతును అణచివేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ప్రజా సమస్యలపై మరింత ఉధృతంగా ఉద్యమాలు చేపడతామని తెలిపారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం కళ్లు తెరిచి ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేకపోతే ప్రజలే తగిన సమాధానం చెబుతారని అన్నారు .



## చలో హైదరాబాదును విజయవంతం చేయండి

బలగం టీవీ , ఎల్లారెడ్డిపేట

TGEJAC పిలుపుమేరకు ఎల్లారెడ్డిపేట మండలంలో చలో హైదరాబాదును జయప్రదం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్ సాధనకై సెప్టెంబర్ 10న తలపెట్టిన చలో హైదరాబాదును జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారము నేతలు పోస్టర్ను ఎల్లారెడ్డిపేట మండల తాసిల్దార్ ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి మండలం నుండి ఉద్యోగులు ఉపాధ్యాయులు పెన్షనర్లు పెద్ద ఎత్తున తరలి రావాలన్నారు ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికే వివిధ దశల్లో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించినట్లు వారు పేర్కొన్నారు ఉద్యోగులు ఉపాధ్యాయులు పెన్షనర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ రద్దుచేసి ప్రభుత్వం ఇచ్చిన హామీకి అనుగుణంగా వెంటనే ఓ పి ఎస్ అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. పిఆర్సి పెండింగ్,డి.ఏ ల చెల్లింపు ఉద్యోగుల పెండింగ్ బిల్లుల పరిష్కారం ఆరోగ్య పథకం అమలు తదితర సమస్యలపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో జాప్యం చేస్తే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు ఉద్యోగుల న్యాయమైన హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమిద్దాం. సెప్టెంబరు 10న 'హైదరాబాదులో కదం తొక్కుదాం 'అని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మార్వాడి గంగరాజు, అవురం సుధాకర్ రెడ్డి, లాల శ్రీనివాసు, కదిరి శ్రీనివాస్ , ఎండి ఇబ్రహీం, ఈ అశోక్ , బావికాడి రామచంద్రం, కాంభోజ సతీష్, J శ్రీనివాసు, కొప్పుల లక్ష్మణ్, బంటు బాలకిషన్, బట్టారి సంపత్ కుమార్, ఎలగందుల ఆంజనేయులు, బాధ వేణి గోపి, ఎంపీడీవో సిబ్బంది మరియు ఎమ్మార్వో సిబ్బంది, భాగస్వామ్య సంఘాల నాయకులు, జిల్లా స్థాయి నాయకులు, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సీఎంఆర్ గడువులోగా తప్పనిసరిగా ఇవ్వాలి..



బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల

జిల్లాలోని రా, బాయిల్డ్ రైస్ మిల్లర్లు సీ ఎం ఆర్ గడువులోగా తప్పనిసరిగా ఇవ్వాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ శ్యాం ప్రసాద్ లాల్ స్పష్టం చేశారు.

యాసంగి, ఖరీఫ్ 2024-25 సీజన్ సీఎంఆర్ పై జిల్లాలోని రా, బాయిల్డ్ రైస్ మిల్లర్లతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ శ్యాం ప్రసాద్ లాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఎఫ్ సీ ఐ, పౌర సరఫరాల శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా జిల్లాలోని రా, బాయిల్డ్ రైస్ మిల్లుల వారీగా ఎంత సీ ఎం ఆర్ ఇవ్వాలి? ఇప్పటివరకు ఎంత ఇచ్చారు? అనే అంశాలపై ఆరా తీశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ శ్యాం ప్రసాద్ లాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలోని రైస్ మిల్లర్లు తప్పనిసరిగా సీ ఎం ఆర్ ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ మేరకు కావలసిన అన్ని ఏర్పాట్లను చేసుకోవాలని సూచించారు. లక్ష్యం మేరకు ఇవ్వాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎఫ్సీఐ డీఎంలు, పౌర సరఫరాల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# శాంతియుత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు నిర్వహించాలి..

### -గణేష్ పోర్టల్–2026లో మండపాల నమోదు తప్పనిసరి

### -మండపాలు, శోభాయాత్రలో డీజేలకు అనుమతి లేదు..

### -ఎస్పీ మహేష్ బి. గీతే

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని,ఉత్సవాల నిర్వహణలో మండపాల నిర్వాహకులు పోలీసు శాఖకు పూర్తి సహాయ సహకారాలు అందించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే సూచించారు. . మంగళవారం సిరిసిల్ల పట్టణంలోని పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, మండపాల నిర్వాహకులు, స్థానిక కౌన్సిలర్లతో సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి. గీతేమాట్లాడుతూ.. గత ఏడాది గణేష్ నిమజ్జనం సందర్భంగా జిల్లా ప్రజలు పోలీసులకు సహకరించారని,అయితే అక్కడక్కడ ఇబ్బందులకు పాల్పడిన వారిపై ఎనిమిది కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నమని అన్నారు .

జిల్లాలోని ప్రతి గణేష్ మండప నిర్వాహకుడు గణేష్ పోర్టల్–2026లో తమ మండపానికి సంబంధించిన వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రజా రవాణాకు, అత్యవసర వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మండపాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.ప్రతి మండపం వద్ద 24 గంటలూ స్వచ్ఛంద సేవకులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మండపం వద్ద జరిగే కార్యక్రమాలకు పూర్తిస్థాయి బాధ్యత నిర్వాహకులదేనని, ప్రతి మండపం వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, అన్ని మండపాలకు భౌగోళిక గుర్తింపు చేయనున్నట్లు తెలిపారు.గణేష్ విగ్రహాల రాక సమయంలో విగ్రహం ఎత్తు 10 అడుగులకు మించి ఉంటే ముందుగానే పోలీసు శాఖకు సమాచారం అందించాలని సూచించారు.నిమజ్జనం రోజున మండపం నుంచి నేరుగా నిర్దేశించిన నిమజ్జన ప్రదేశానికి వెళ్లాలని, నిర్ణయించిన సమయానికి నిమజ్జనం పూర్తి చేయాలని అన్నారు . సిరిసిల్ల మానేరు తీరంలో ఏర్పాటు చేయనున్న నిమజ్జన ప్రదేశంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా తగినన్ని క్రేన్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.ఉత్సవాలను నిబంధనలకు లోబడి నిర్వహించాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మండపాలను పోలీసు అధికారులు, బ్లూకోల్ట్ సిబ్బంది తరచూ సందర్శిస్తూ పరిస్థితులను పర్యవేక్షిస్తారని చెప్పారు. మండపాల



వద్ద మద్యం సేవించడం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడటం వంటి చర్యలకు పాల్పడే వారితో పాటు వాటిని అడ్డుకోవడంలో నిర్లక్ష్యం వహించే మండప నిర్వాహకులపైనా కేసులు నమోదు చేస్తామని అన్నారు.గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండపాల వద్ద, శోభాయాత్ర, నిమజ్జనం రోజున డీజేలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదని అన్నారు . అనుమతి లేకుండా డీజేలను వినియోగిస్తే డీజే నిర్వాహకులతో పాటు సంబంధిత మండప నిర్వాహకులపైనా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా రాత్రి 10 గంటల వరకు మాత్రమే రెండు చిన్న స్పీకర్లను వినియోగించాలని సూచించారు.గణేష్ ఉత్సవాల సందర్భంగా సామాజిక మాధ్యమాల్లో వచ్చే పోస్టులపై జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. విద్వేషాలను రెచ్చగొట్టేలా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా పోస్టులు చేసే వారిపై, వాస్తవాలను తెలుసుకోకుండా అలాంటి పోస్టులను ఇతరులకు పంపించే వారిపైనా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.ఈ సమావేశంలో డీఎస్పీ నాగేంద్రచారి, సీఐలు శ్రీనివాస్, నాగేశ్వరరావు, వెంకటేష్, పోలీసు సిబ్బంది, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, మండపాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# మారుమూల ఎల్లారెడ్డిపేటలో ఆధునిక వైద్యానికి చిరునామా.. అశ్విని ఆసుపత్రి

### నాలుగు దశాబ్దాలుగా వైద్య సేవలు.. అత్యాధునిక క్యాత్ ల్యాబ్‌తో గుండె చికిత్సలు

### నాలుగు నెలల్లో 80 మందికి అంజియోగ్రామ్.. 30 మందికి స్టంట్లు

### అతితక్కువ ప్యాకేజీతో గుండె రోగులకు చికిత్స.. పలువురిని ప్రాణాపాయం నుంచి కాపాడిన వైద్య బృందం

బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మారుమూల ప్రాంతమైన ఎల్లారెడ్డిపేటలో అత్యాధునిక వైద్య సేవలకు వేదికగా అశ్విని మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిలుస్తోంది. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో నాలుగు దశాబ్దాలుగా సేవలందిస్తున్న అశ్విని ఆసుపత్రి.. కాలానుగుణంగా ఆధునిక వైద్య సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ ముందుకు సాగుతోంది.

**అత్యాధునిక క్యాత్ ల్యాబ్‌తో గుండె వైద్యం**

ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన అత్యాధునిక క్యాత్ ల్యాబ్ ద్వారా గుండె సంబంధిత వ్యాధులకు ఆధునిక వైద్య సేవలు అందిస్తున్నారు. గుండెకు సంబంధించిన సమస్యలను సకాలంలో గుర్తించి, అవసరమైన చికిత్స అందించడం ద్వారా రోగులకు ప్రాణాపాయం నుంచి రక్షణ కల్పిస్తున్నట్లు ఆసుపత్రి వైద్యులు తెలిపారు.

గుండె వైద్య నిపుణులు డాక్టర్ పరమేశ్వర్ రెడ్డి నేతృత్వంలోని వైద్య బృందం క్యాత్ ల్యాబ్ ద్వారా గుండె రోగులకు అవసరమైన పరీక్షలు, చికిత్సలు అందిస్తోంది.

**నాలుగు నెలల్లో 80 మందికి అంజియోగ్రామ్ పరీక్షలు**

గత నాలుగు నెలల్లోనే అశ్విని ఆసుపత్రిలో 80 మంది గుండె వ్యాధి బాధితులకు అంజియోగ్రామ్ పరీక్షలు నిర్వహించినట్లు ఆసుపత్రి వైద్యులు డాక్టర్ గోవర్ధనం సత్యనారాయణ స్వామి, మేనేజింగ్ డైరెక్టర్ అభినయ్, గుండె వైద్యులు డాక్టర్ పరమేశ్వర్ రెడ్డి తెలిపారు.

అంజియోగ్రామ్ పరీక్షల ద్వారా గుండె రక్తనాళాల్లో ఉన్న బ్లాకులను గుర్తించి, రోగి పరిస్థితిని బట్టి తదుపరి చికిత్సను నిర్ణయిస్తున్నట్లు వారు వివరించారు.

**30 మందికి గుండెలో స్టంట్లు**

అంజియోగ్రామ్‌లో గుండె రక్తనాళాల్లో బ్లాకులు ఉన్నట్లు గుర్తించిన 30 మంది రోగులకు స్టంట్లు వేసినట్లు వైద్యులు వెల్లడించారు. అత్యవసర పరిస్థితుల్లో సకాలంలో చికిత్స అందించడంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న పలువురు రోగులను కాపాడి వారి ప్రాణాలను రక్షించగలిగామని తెలిపారు.

గుండె రక్తనాళాల్లో బ్లాకులు ఉన్న రోగులకు అవసరమైన చికిత్సను అందించడంతో పాటు అతితక్కువ ప్యాకేజీ ద్వారా స్టంట్ చికిత్సను అందిస్తున్నట్లు వైద్యులు పేర్కొన్నారు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనే గ్రామీణ ప్రాంత ప్రజలకు గుండె వైద్యం మరింత అందుబాటులోకి వస్తోందని తెలిపారు.

**సకాలంలో వైద్యం.. ప్రాణాలకు రక్షణ**



గుండెపోటు వంటి అత్యవసర పరిస్థితుల్లో ప్రతి నిమిషం ఎంతో కీలకమని వైద్యులు పేర్కొంటున్నారు. గుండె రక్తనాళాల్లో బ్లాకులు ఏర్పడినప్పుడు ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించడం, అవసరమైన పరీక్షలు చేయించుకోవడం ద్వారా ప్రాణాపాయాన్ని తగ్గించవచ్చని సూచిస్తున్నారు.

స్థానికంగానే క్యాత్ ల్యాబ్, గుండె వైద్య నిపుణుల సేవలు అందుబాటులో ఉండటంతో ఎల్లారెడ్డిపేటతో పాటు పరిసర మండలాల ప్రజలకు అత్యవసర గుండె వైద్యం చేరువైందని ఆసుపత్రి వర్గాలు చెబుతున్నాయి.

**ఆరోగ్యశ్రీతో డయాలసిస్ సేవలు**

కిడ్నీ వైఫల్యంతో బాధపడుతున్న రోగులకు కూడా అశ్విని ఆసుపత్రి సేవలు అందిస్తోంది. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా డయాలసిస్ సేవలు అందుబాటులో ఉండటంతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భారం తగ్గుతోంది. స్థానికంగానే డయాలసిస్ సేవలు పొందే అవకాశం కల్పించడం ద్వారా దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బందులను తగ్గిస్తోంది.

**నరాలు, ఎముకలు, కీళ్లకు ప్రత్యేక వైద్యం**

నరాల సంబంధిత వ్యాధులతో పాటు ఎముకలు, కీళ్ల సమస్యలకు ప్రత్యేక వైద్య నిపుణులతో చికిత్స అందిస్తున్నారు. అవసరమైన సందర్భాల్లో శస్త్రచికిత్సలు నిర్వహిస్తూ మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నారు.

ముఖ్యంగా మోకాళ్ల మార్పిడి శస్త్రచికిత్సలు సహా ఆర్థోపెడిక్ విభాగంలో ఆధునిక చికిత్సా విధానాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆసుపత్రి నిర్వాహకులు తెలిపారు.

**పాము కాటు.. విషం తాగిన వారికీ అత్యవసర సేవలు**

అత్యవసర వైద్య సేవల్లోనూ అశ్విని ఆసుపత్రికి స్థానికంగా ప్రత్యేక గుర్తింపు ఉంది. పాము కాటు, విష పదార్థాలు తీసుకోవడం వంటి అత్యవసర పరిస్థితుల్లో సకాలంలో చికిత్స అందించి పలువురి ప్రాణాలను కాపాడిన అనుభవం ఆసుపత్రికి ఉందని వైద్యులు తెలిపారు.

గ్రామీణ ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితుల్లో వెంటనే అందుబాటులో ఉండే వైద్యశాల ఎంతో అవసరమని, ఆ దిశగా అశ్విని ఆసుపత్రి నిరంతరం సేవలు అందిస్తోందని పేర్కొన్నారు.

**నాలుగు దశాబ్దాల సేవా ప్రస్థానం**

అశ్విని ఆసుపత్రి వ్యవస్థాపకులు డాక్టర్ గోవర్ధనం సత్యనారాయణ స్వామి, ఆయన తనయుడు, ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ అభినయ్ సారథ్యంలో నాలుగు దశాబ్దాలుగా ఎల్లారెడ్డిపేట ప్రాంతంలో వైద్య సేవలు కొనసాగుతున్నాయి.

కాలానుగుణంగా ఆధునిక వైద్య సాంకేతికతను అందిపుచ్చుకోవడంతో పాటు వివిధ వైద్య విభాగాలకు చెందిన నిపుణుల సేవలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నామని వారు తెలిపారు.

**ఒకే చోట.. అనేక వైద్య సేవలు**

గుండె వైద్యం, క్యాత్ ల్యాబ్ సేవలు, అంజియోగ్రామ్, స్టంట్ చికిత్సలతో పాటు కిడ్నీ రోగులకు డయాలసిస్, నరాల వ్యాధులు, ఎముకలు, కీళ్ల సమస్యలు, మోకాళ్ల మార్పిడి, అత్యవసర వైద్యం తదితర సేవలను అందుబాటులో ఉంచడం అశ్విని ఆసుపత్రి ప్రత్యేకతగా నిలుస్తోంది.

మారుమూల ప్రాంతంలో ప్రారంభమైన ఆసుపత్రి నాలుగు దశాబ్దాల కాలంలో ఆధునిక వైద్య సేవలకు కేంద్రంగా ఎదగడం విశేషం. గత నాలుగు నెలల్లో 80 అంజియోగ్రామ్ పరీక్షలు, 30 స్టంట్ చికిత్సలు నిర్వహించినట్లు వైద్యులు వెల్లడించడం ద్వారా గుండె వైద్య విభాగంలో అందిస్తున్న సేవల విస్తృతిని తెలియజేస్తోంది.

గ్రామీణ ప్రాంత ప్రజలకు అత్యాధునిక వైద్యం.. అందుబాటు ధరల్లో చికిత్స.. అత్యవసర వేళల్లో సకాలంలో వైద్య సేవలు — ఈ లక్ష్యాలతో అశ్విని మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఎల్లారెడ్డిపేట ప్రాంత ప్రజలకు వైద్య భరోసాగా నిలుస్తోంది.

# కేసీఆర్‌పై వ్యాఖ్యలను ఖండిస్తూ బీఆర్ఎస్వీ ధర్నా

### సీఎం, కాంగ్రెస్ ఎమ్మెల్యేల దిష్టిబొమ్మల దహనం

### బీఆర్ఎస్వీ నాయకుల అరెస్టు.. పోలీసులతో పెనుగులాట

బలగం టీవీ , ఎల్లారెడ్డిపేట

మాజీ సీఎం కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వీర్ల శంకర్, వేముల వీరేశం చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బీఆర్ఎస్ యూత్‌వింగ్ (బీఆర్ఎస్వీ) నాయకులు మంగళవారం సాయంత్రం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో మెరుపు ధర్నా నిర్వహించారు. పాత బస్టాండ్‌లో సీఎం, కాంగ్రెస్ ఎమ్మెల్యేల దిష్టిబొమ్మలను దహనం చేసి నిరసన తెలిపారు.

సాయంత్రం 5 గంటలకు దిష్టిబొమ్మలను పాత బస్టాండ్‌లో ఉంచి కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తుండగా పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అయితే పోలీసులు వచ్చేలోపే బీఆర్ఎస్వీ నాయకులు దిష్టిబొమ్మలను దహనం చేశారు. అనంతరం వాటిని రోడ్డుపై నుంచి తొలగించే క్రమంలో పోలీసులు, బీఆర్ఎస్వీ నాయకుల మధ్య పెనుగులాట జరిగింది.

ఈ ఘటనలో బీఆర్ఎస్వీ నాయకులు సింగారం దేవరాజు, ల్యాగల సతీశ్‌రెడ్డి, లింగాల సన్నీ, రేసు గణేశ్, సయ్యద్ జుబేర్, నాగరాజులను పోలీసులు అరెస్టు చేసి ఎల్లారెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. కాంగ్రెస్ నాయకులు దిష్టిబొమ్మలు దహనం చేసినప్పుడు కేసులు నమోదు చేయకుండా, బీఆర్ఎస్ నాయకులపై కేసులు పెట్టడమేంటని పోలీసుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అరెస్టయిన నాయకులను పరామర్శించి భరోసా కల్పించారు. పీఏసీఎస్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ ఎలుసాని మోహన్, పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



# ఆధిపత్యంలో ఈస్ట్ జోన్.. సౌత్ జోన్ పోరాటం



## దులీప్ ట్రోఫీ ఫైనల్

బలగం టీవీ, హైదరాబాద్

ఈస్ట్ జోన్ బ్యాటర్లు, బౌలర్ల సమష్టి ప్రదర్శనతో దులీప్ ట్రోఫీ 2026 ఫైనల్‌లో సౌత్ జోన్‌పై తమ పట్టును మరింత బిగించారు. తొలి ఇన్నింగ్స్‌లో 708 పరుగుల కొండంత స్కోరు నమోదు చేసిన ఈస్ట్ జోన్, అనంతరం ప్రత్యర్థి బ్యాటర్లను తీవ్రంగా ఒత్తిడిలోకి నెట్టింది. బౌలర్లు మహమ్మద్ షమీ (2/17), ముఖేష్ కుమార్ (2/36) ప్రారంభం నుంచే నిప్పులు చెరగడంతో మూడో రోజు ఆట ముగిసే సమయానికి సౌత్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 6 వికెట్ల నష్టానికి 242 పరుగులు చేసింది. ప్రస్తుతం సౌత్ జోన్ ఇంకా 466 పరుగుల భారీ వ్యత్యాసంతో వెనుకబడి ఉంది.

బ్యాటర్ల నిరాశ – తిలక్ ఒంటరి పోరాటం భారీ లక్ష్యాన్ని సాధించే క్రమంలో సౌత్ జోన్ బ్యాటర్లు ఆశించిన రీతిలో రాణించలేకపోయారు. ఓపెనర్ రికీ భుయ్ (1) త్వరగానే నిష్క్రమించగా, నారాయణ్ జగదీసన్ (32), దేవదత్ పడిక్కల్ (62) ఇన్నింగ్స్‌ను నిలబెట్టే యత్నం చేశారు. అయితే ఈస్ట్ జోన్ బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు తీస్తూ సౌత్ జోన్‌ను కోలుకోలేని దెబ్బతీశారు. వికెట్లు పడుతున్నా తెలంగాణ కుర్రాడు తిలక్ వర్మ (56 నాటౌట్) బాధ్యతాయుతంగా బ్యాటింగ్ చేస్తూ హాఫ్ సెంచరీ సాధించాడు. శ్రేయాస్ గోపాల్ (23)తో కలిసి 66 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పిన తిలక్, మూడో రోజు ఆట పూర్తయ్యేసరికి చామ మిలింద్ (2 నాటౌట్)తో కలిసి క్రీజులో ఉన్నాడు.

మ్యాచ్ సమగ్ర సమాచారం:

ఈస్ట్ జోన్ రికార్డు స్కోరు (708/10): టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఈస్ట్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 163 ఓవర్లలో 708 పరుగుల కొండంత స్కోరు సాధించింది. కెప్టెన్ ఇషాన్ కిషన్ డబుల్ సెంచరీ (334 బంతుల్లో 30 ఫోర్లు, 7 సిక్సర్లతో 270 పరుగులు) చేసి జట్టుకు భారీ స్కోరు అందించగా, కుమార్ కుశాగ్రా (101) సెంచరీ సాధించాడు. ఓపెనర్లు అభిమన్యు ఈశ్వరన్ (72), శిఖర్ మోహన్ (85) అర్ధశతకాలతో రాణించారు.

సౌత్ జోన్ బ్యాటింగ్ వైఫల్యం: భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన సౌత్ జోన్ బ్యాటర్లు ఈస్ట్ జోన్ బౌలర్ల ధాటికి నిలవలేకపోయారు. ఓపెనర్ రికీ భుయ్ (1) తక్కువ స్కోరుకే వెనుదిరగ్గా, నారాయణ్ జగదీసన్ (32), దేవ్‌దత్ పడిక్కల్ (62) ఆరంభంలో ఆదుకున్నా కీలక సమయంలో వికెట్లు సమర్పించుకున్నారు. పడిక్కల్ అర్ధశతకం సాధించగా, షేక్ రషీద్ (27), రవిచంద్రన్ స్మరణ్ (23) నిరాశపరిచారు.

తిలక్ వర్మ బాధ్యతాయుత పోరాటం: సౌత్ జోన్ వరుసగా వికెట్లు కోల్పోతున్న సమయంలో తిలక్ వర్మ (133 బంతుల్లో 5 ఫోర్లతో 56 నాటౌట్) ఒంటరి పోరాటం చేశాడు. శ్రేయాస్ గోపాల్ (23) తో కలిసి 66 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి ఇన్నింగ్స్‌ను నిలబెట్టే ప్రయత్నం చేశాడు. ప్రస్తుతం తిలక్ వర్మతో పాటు చామ మిలింద్ (2 నాటౌట్) క్రీజులో ఉన్నారు.

నిప్పులు చెరిగిన షమీ, ముఖేష్: ఈస్ట్ జోన్ బౌలర్లలో అనుభవజ్ఞులైన మహమ్మద్ షమీ (2/17), ముఖేష్ కుమార్ (2/36) క్రమశిక్షణతో కూడిన లైన్ అండ్ లెంగ్త్‌తో సౌత్ జోన్ బ్యాటర్లను కట్టడి చేశారు. ఎండి కౌనైన్ ఖురైషి, శిఖర్ మోహన్ తలో వికెట్ పడగొట్టారు.

సౌత్ జోన్ ఫాలో-ఆన్ తప్పించుకోవాలన్నా, మ్యాచ్‌ను కాపాడుకోవాలన్నా నాలుగో రోజు తిలక్ వర్మ సుదీర్ఘంగా బ్యాటింగ్ చేయాల్సి ఉంది. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఈస్ట్ జోన్ చారిత్రాత్మక విజయం సాధించే దిశగా బలమైన అడుగులు వేస్తోంది.







# రోహిత్ యాదవ్‌పై రెండేళ్ల నిషేధం

## వయసు మోసం నేపథ్యంలో అండర్-19 జట్టు నుంచి తొలగింపు

## ఆస్ట్రేలియా పర్యటనకు ప్రత్యామ్నాయ ఆటగాళ్ల ఎంపిక

బలగం టీవీ, హైదరాబాద్

వయసు ధ్రువీకరణలో మోసానికి పాల్పడిన యువ క్రికెటర్ రోహిత్ యాదవ్‌పై భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కఠిన చర్యలు తీసుకుంది. ఇప్పటికే అతడిపై రెండేళ్ల నిషేధం విధించిన బీసీసీఐ.. తాజాగా ఆస్ట్రేలియా పర్యటనకు ఎంపిక చేసిన భారత అండర్-19 జట్టు నుంచి కూడా తొలగించింది.

శ్రీలంక పర్యటన సందర్భంగా రోహిత్ సమర్పించిన వయసు ధ్రువీకరణ పత్రాల్లో పుట్టిన సంవత్సరం వేర్వేరుగా ఉన్నట్లు గుర్తించారు. ఒక పత్రంలో 2007లో జన్మించినట్లు ఉండగా.. ఆధార్ కార్డులో 2009గా నమోదై ఉంది. వయసును దాచేందుకు ప్రయత్నించినట్లు నిర్ధారించిన బీసీసీఐ రెండేళ్ల నిషేధం విధించింది.

రోహిత్ స్థానంలో అండర్-19 వన్డే జట్టులో సౌరాష్ట్రకు చెందిన ఆర్యన్ సవ్సానీని ఎంపిక చేశారు. మల్టీడే జట్టులో హర్యానా స్పిన్నర్ తన్మయ్ బలోడాకు చోటు కల్పించారు.

ఇదే వ్యవహారంపై బెంగాల్ క్రికెట్ సంఘం కూడా గతంలో చర్యలు తీసుకుని రోహిత్‌ను జూనియర్ స్థాయి క్రికెట్‌కు దూరంగా ఉంచింది. తాజాగా బీసీసీఐ చర్యతో అతడి క్రికెట్ కెరీర్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది.

అండర్-19 వన్డే జట్టు: లక్ష్య రాయ్‌చందని (కెప్టెన్), యశ్‌బర్దన్ చౌహాన్ (వైస్ కెప్టెన్), రజత్ బఘేల్, ఆర్యవీర్ సెహ్వాగ్, వీకే వినీత్, కుషగ్ర ఓఝా, అర్జున్ రాజ్‌పుత్, మనాల్ చౌహాన్, అన్వయ్ ద్రవిడ్, వి.యశ్వీర్ యాదవ్, శవిన్ వినోద్, మోహిత్ ఉల్వా, చిగురుపాటి వెంకటక, కావ్య పటేల్, ఆర్యన్ సవ్సానీ.

మల్టీడే జట్టు: యశ్‌బర్దన్ చౌహాన్ (కెప్టెన్), లక్ష్య రాయ్‌చందని (వైస్ కెప్టెన్), కుషగ్ర ఓఝా, మనాల్ చౌహాన్, కుశ్ పటేల్, మానవ్ కృష్ణ, అభిప్రాయ్ బిస్వాస్, ఇషాన్ ఓం, అయాన్ అక్రమ్, ప్రణవ్ రఘువేంద్ర, ప్రియాన్ష్ సింగ్, మోహిత్ ఉల్వా, అర్యన్ యాదవ్, తన్మయ్ బలోడా.

# బీసీసీఐ అసోసియేట్ స్పాన్సర్‌గా చాట్‌జీపీటీ




## మ్యాచ్‌కు రూ.1.20 కోట్ల డీల్.. 2028 మార్చి వరకు ఒప్పందం

## క్యాంపా కోలా, ఎస్‌బీఐ లైఫ్ కూడా అసోసియేట్ పార్ట్‌నర్లు

బలగం టీవీ, హైదరాబాద్

ప్రపంచంలోనే అత్యంత ధనిక క్రికెట్ బోర్డుగా పేరున్న బీసీసీఐకి దిగ్గజ కృత్రిమ మేధ వేదిక చాట్‌జీపీటీ అసోసియేట్ స్పాన్సర్‌గా వ్యవహరించనుంది. భారత్ వేదికగా జరిగే ద్వైపాక్షిక మ్యాచ్‌లకు సంబంధించి ఒక్కో మ్యాచ్‌కు రూ.1.20 కోట్లు చెల్లించేలా బీసీసీఐతో చాట్‌జీపీటీ ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం. ఈ ఒప్పందం 2028 మార్చి వరకు కొనసాగనుంది.

అసోసియేట్ పార్ట్‌నర్‌షిప్ కోసం బీసీసీఐ నిర్వహించిన వేలంలో క్యాంపా కోలా ఒక్కో మ్యాచ్‌కు రూ.1.31 కోట్ల బిడ్‌తో అగ్రస్థానంలో నిలిచింది. చాట్‌జీపీటీతో పాటు ఎస్‌బీఐ లైఫ్ రూ.1.20 కోట్ల బిడ్‌తో ఒప్పందాలు దక్కించుకున్నాయి. బిస్లరీ, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ కూడా ఇదే స్థాయిలో బిడ్ చేసినప్పటికీ వెనుకంజలో నిలిచాయి.

అసోసియేట్ పార్ట్‌నర్ డీల్ బీసీసీఐకి ప్రధాన ఆదాయ వనరు కాకపోయినా, టైటిల్ స్పాన్సర్ ఎంపికలో జాప్యం జరుగుతున్న నేపథ్యంలో బోర్డు వ్యూహాత్మకంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. గత టైటిల్ స్పాన్సర్‌షిప్ ఒప్పందం ఆగస్టు 2026లో ముగియడంతో, కొత్త టైటిల్ స్పాన్సర్ కోసం చర్చలు కొనసాగుతున్నాయి.

బీసీసీఐ స్పాన్సర్‌షిప్ వ్యవస్థలో టైటిల్ స్పాన్సర్, అధికారిక జెర్సీ భాగస్వామి, అసోసియేట్ పార్ట్‌నర్ అనే మూడు ప్రధాన విభాగాలున్నాయి. టైటిల్ స్పాన్సర్ పేరు సిరీస్, మ్యాచ్‌లతో ముడిపడి ఉంటుంది. అధికారిక జెర్సీ భాగస్వామి బ్రాండ్ ఆటగాళ్ల జెర్సీలపై కనిపిస్తుంది. అసోసియేట్ పార్ట్‌నర్ల బ్రాండ్లు బౌండరీ బోర్డులు, డిజిటల్ తెరలు, మ్యాచ్ అనంతర కార్యక్రమాల వేదికలపై దర్శనమిస్తాయి.

క్రికెట్ మ్యాచ్‌లలో సాధారణంగా శీతల పానీయాలు, బీమా సంస్థల ప్రకటనలు కనిపిస్తుండగా.. కృత్రిమ మేధ సంస్థ చాట్‌జీపీటీ ఒక్కో మ్యాచ్‌కు రూ.1.20 కోట్లు చెల్లించి స్పాన్సర్‌గా రావడం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# బాలన్ డీఓర్ రేసులో మెస్సీ

## నామినేషన్లలో చోటు దక్కని రొనాల్డో.. 30 మంది స్టార్ ఆటగాళ్ల పోటీ


బలగం టీవీ, హైదరాబాద్

అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు వీడ్కోలు పలికిన అర్జెంటీనా దిగ్గజం లియోనల్ మెస్సీ మరోసారి ప్రతిష్ఠాత్మక బాలన్ డీఓర్ అవార్డు రేసులో నిలిచాడు. 2026 ఏడాదికి ప్రకటించిన నామినేషన్లలో మెస్సీకి చోటు దక్కింది. ఇప్పటికే రికార్డు స్థాయిలో ఎనిమిదిసార్లు ఈ పురస్కారాన్ని గెలుచుకున్న మెస్సీ.. ఈసారి కూడా యువ ఆటగాళ్లకు గట్టి పోటీ ఇవ్వనున్నాడు.

మెస్సీతో పాటు ఫ్రాన్స్ స్టార్ కిలియన్ ఎంబాపే, స్పెయిన్ యువ సంచలనం లమినే యమల్, ఇంగ్లండ్ స్టార్ హ్యారీ కేన్ తదితరులు అవార్డు రేసులో ఉన్నారు. మొత్తంగా 30 మంది ఆటగాళ్లు ఈ ఏడాది బాలన్ డీఓర్ కోసం నామినేట్ అయ్యారు.

అయితే మెస్సీ సమకాలీకుడైన పోర్చుగల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డోకు మాత్రం నిరాశ ఎదురైంది. ఐదుసార్లు బాలన్ డీఓర్ విజేతగా నిలిచిన రొనాల్డో ఈసారి నామినేషన్లలో చోటు దక్కించుకోలేకపోయాడు. అల్ నస్ర్ తరఫున ఆశించిన స్థాయిలో ప్రదర్శన చేయకపోవడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది.

క్లబ్‌ల పరంగా చూస్తే పారిస్ సెయింట్ జర్మైన్ ఆటగాళ్లదే ఆధిపత్యం కనిపిస్తోంది. ఆ క్లబ్ నుంచి ఏకంగా 10 మంది ఆటగాళ్లు నామినేట్ అయ్యారు. రియల్ మాడ్రిడ్ నుంచి నలుగురు ఉండగా.. బార్సిలోనా, బేయెర్న్ మ్యూనిక్ జట్లకు చెందిన పలువురు ఆటగాళ్లు కూడా అవార్డు రేసులో ఉన్నారు.



# ఏం మాట్లాడుతున్నరు సారూ.. పొట్టకు వచ్చిన పంటను కొయ్యమంటావా..



బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

ఏం మాట్లాడుతున్నరు సారూ.. పొట్టకు వచ్చిన పంటను కొయ్యమంటావా..నీ పైసలోద్దు .. ఏం వద్దు..బలగం సినిమా షూట్ సందర్భం లో ఆ రైతు మాటలకు మేమంత షాక్ సిని ఇండస్ట్రీలో బ్లాక్ బస్టర్ హిట్ కొట్టిన బలగం సినిమా షూటింగ్ సందర్భంలో ఒక రైతు మాటలు మమ్ములను షాక్ కు గురి చేశాయి.

ఈ రోజు యూ ట్యూబ్ అనుకోకుండా నా పాత ఇంటర్వ్యూను మళ్లీ చూశాను. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ సమీపంలోని అగ్రహారం గ్రామంలో బలగం సినిమా క్లైమాక్స్ సన్నివేశాలు చిత్రికరణ సందర్భంగా లోకేషన్ నచ్చి.. ఆ పక్కనే ఉన్న పంట పోలాలను తీసివేయించి పక్కనే ఉన్న మానేరు వాగు కనిపించేలా, అక్కడే పిట్లకు పెట్టే సన్నివేశం అన్నమాట. షూటింగ్ తెర వెనక ముచ్చట ఈ రోజు నేను మీతో పంచుకోవాలని చెబుతున్న.

రాజన్న సిరిసిల్ల జిల్లా అగ్రహారం లో పెద్ద మర్రిచెట్టు ఉంటుంది బలగం క్లైమాక్స్ సన్నివేశం తీసింది ఇక్కడే. ఈ లోకేషన్ కావాలని డైరక్టర్ వేణు యెల్దండి, దిల్ రాజు ప్రోడక్షన్ మేనేజర్ రవితేజ గారు వెళ్లాం. లోకేషన్ అంతా ఓకే అయ్యింది. షూట్ పర్సన్ లో పక్కనే ఉన్న మానేరు వాగు కనిపించాలి మనకు. ఆ నది ఒడ్డునే చితి పేర్చి.. కల్చాక.. పిట్టకు పెట్టే సన్నివేశం అన్నమాట.. దానికి అనుకోని ఉన్న వరి పొలం షూట్ కు అడ్డుగా ఉంది. చెట్టు దగ్గర నుంచి వాగు వరకు మొత్తం కోసి వేయించండి అని డైరక్టర్ వేణు వెళ్లిపోయాడు. నేను దిల్ రాజు ప్రోడక్షన్ మేనేజర్ రవితేజ ఆ రైతును పిలిచి మాట్లాడం. ఇక్కడ సినిమా షూట్ చేస్తున్నం ఈ పొలం నీదే అని తెలిసింది..వాగు వరకు వరి పొలాలు తీసి వేయాల్సి ఉంటుంది.. ఎన్ని ఎకరాలో చెప్పండి మొత్తం ఆ డబ్బు ఇస్తాము అని మేనేజర్ తెలిపారు. పక్కనే నేను ఉన్నాను.

ఒక్కసారిగా రైతు కాస్తా సిరియస్ అయ్యారు. ఏం మాట్లాడుతున్నారు సర్.. మీరిచ్చే పైసలకు పొట్టకొచ్చిన పంటను కొయ్యమంటారు...? సాధుకున్న పిల్లలను సంపుకుంటారా..? నేను కొయ్యను ఎన్ని పైసలిచ్చిన అనడంతో ఒక్కసారిగా మేమంత షాక్.

సినిమా వాళ్ల వెర్షన్ ఎలా ఉంటుంది అంటే డబ్బు ఇస్తే ఏదైన సాధ్యమవుతుంది అనుకుంటారు కానీ ఆ రైతును ఒప్పించడంలో ఫేయిల్ అయ్యాం. ఎలాగైన షూట్ చేయాలని మేనేజర్ రవితేజ ఎకరాకు లక్షా రూపాయలు ఇస్తాం, ఇంకా అదనంగా ఏమైన కావాలన్న ఇస్తాం అని చెప్పిన ఆ రైతు ఒప్పుకోలేదు. ఈ విషయాన్ని డైరక్టర్ వేణు యెల్దండికి చెప్పడంతో ఆయన కూడా షాక్ నిజమే కదా అన్న.. పొట్టకు వచ్చిన వరిని రైతులు కొయడానికి ఒప్పుకోరు.. ఆ వరిని కోపించకుండానే .. ఆ పక్కనే ఉన్న మూడు గుంటల స్థలంలో షూట్ చేసుకుందాం అని వేణు యెల్దండి మాతో చెప్పాడు. అనుకున్నట్లుగానే ఆ రైతు మాటలకు గౌరవం ఇచ్చి.. షూటింగ్ స్థలంను కుదించుకొని చిన్న స్థలంలో ముగించారు.

ఇక్కడ నేను ఎందుకు ఈ విషయం గుర్తు చేస్తున్ననంటే.. ఒక రైతు తన పంటను పసిబిడ్డల కంటే ఎక్కువ గా చూసుకోవడమే కాదు.. కాపాడుకుంటడు. కేవలం డబ్బు కోసం వ్యవసాయ చేయడం కాదు.. ఈ దేశానికి అన్నం పెట్టడానికి, విలువలతో కూడిన బతుకు బతుకుతడు, ఎవరిని మోసం చేయడు.. అని చెప్పడానికి. డబ్బుకు గడ్డి తినే ఈ రోజుల్లో.. ఒక రైతుకు కొన్ని లక్షలు అఫర్ చేసిన పొట్టొకు వచ్చిన వరి పంటను కొయడానికి ఒప్పుకోలేదు. డబ్బును తిరస్కరించాడు. ఒక సినియర్ జర్నలిస్టుగా నేను కూడా అంతగా ఆలోచించలేదు.. కేవలం డబ్బు కోణంలోనే చూశాను. వరికి జరిగే నష్టం ఇస్తే సరిపోతుంది కదా అనుకున్నాను. ఆ రైతు మాటలు విన్నాక.. మాది మేం నామూష్ గా పీల్ అయ్యాం.. ఆ రైతు ఆలోచించినంత మేము కూడా ఆలోచించలేకపోయాం.. అతి కష్టం మీద ఆ రైతును ఒప్పించి కేవలం మూడు గుంటల్లో గడ్డి క్లీన్ చేసుకొని షూట్ పూర్తి చేశాం.. వాహనాలు రాకుండా వరి అడ్డం ఉంటే వాహనాలు రోడ్డ మీదనే పెట్టివ నడచుకుంటు వచ్చి షూట్ పూర్తి చేశాం.

ఆ రైతు మాటలు నా గుండెలను హత్తుకున్నాయి. ఈ రోజుల్లో కూడా డబ్బుకు తలొగ్గని వారు ఎవరైన ఉన్నారా అంటే అది రైతులే అనోచ్చు. రైతులకు ఏం ఆన్యాయం జరిగిన.. వారిని మోసం చేసిన చెట్లను, గుట్టలను దేవుళ్లుగా భావించి పూజలు నిర్వహించినట్లు.. తన కష్టపడి పండించే పంటను కూడా తన బిడ్డగా భావించి నెలలు నిండకముందు.. పొట్టకు వచ్చిన క్రమంతో తన గొౌతు కోయవద్దని, ఆ వరి కోస్తే అందులో నుంచి వచ్చే ధాన్యం ఉత్పత్తి.. పలువురి కడుపు నిండాలని చూసిండు కానీ లక్షల రూపాయల ఆఫర్ ను ఎడమ కాలుతో తన్నిండనే చెప్పాలి.

ఈ జరిగిన సన్నివేశంను బలగం డైరక్టర్ వేణు యెల్దండి డైరి లో రాసుకున్నారు.. ఈ సందర్భం ఎప్పుడు ఎదరుకాలేదని.. ఈ రైతు అన్న డైలాగులు కూడా రాసుకున్నాడు. ఈ విషయం సనిమా విజయవంతం అయ్యి మూడేళ్ల తర్వాత మీతో నేను పంచుకుంటున్నాను. ఒక యాదార్థ ఘటన..

హాట్సాఫ్ రైతన్న.. ☐ బాలు కాయితి సిరిసిల్ల .. కలం నుంచి..



# భారత్‌తో మ్యాచ్‌కు జపాన్ జట్టు ప్రకటన

## సెప్టెంబర్ 22న ఏకైక టీ20 మ్యాచ్

## కెండిల్ కడోవాకి ఫ్లెమింగ్‌కు సారథ్య బాధ్యతలు

బలగం టీవీ, హైదరాబాద్


టీమిండియాతో జరిగే ఏకైక టీ20 మ్యాచ్‌కు జపాన్ జట్టును ప్రకటించింది. సెప్టెంబర్ 22న సానోలో జరగనున్న ఈ మ్యాచ్‌కు జపాన్ జట్టు సారథిగా కెండిల్ కడోవాకి ఫ్లెమింగ్‌ను ఎంపిక చేసింది. ఆసియా క్రీడల్లోనూ అతడే జట్టుకు నాయకత్వం వహించనున్నాడు.

భారత్, జపాన్ దేశాల మధ్య 75 ఏళ్ల అనుబంధానికి గుర్తుగా ఈ మ్యాచ్‌ను నిర్వహించనున్నారు. 30 ఏళ్ల కడోవాకి ఫ్లెమింగ్ 55 టీ20 మ్యాచ్‌లు ఆడి 1,871 పరుగులు చేశాడు. 139 స్ట్రైక్‌రేట్‌తో బ్యాటింగ్ చేసిన అతడి ఖాతాలో రెండు శతకాలు, 12 అర్ధశతకాలు ఉన్నాయి.

జపాన్ జట్టులో ఇబ్రహీం తకహషి, డెక్లన్ సుజుకి మెక్‌కాంబ్ వంటి అనుభవజ్ఞులు ఉన్నారు. వీరిద్దరూ అంతర్జాతీయ టీ20ల్లో 50కి పైగా మ్యాచ్‌లు ఆడినట్లు ఐసీసీ వెల్లడించింది. వికెట్ కీపర్ వాటారు మియావుచి, లెగ్ స్పిన్నర్ మకోటో తనియామా కూడా జట్టులో చోటు దక్కించుకున్నారు.

ఆసియా క్రీడలు సెప్టెంబర్ 19 నుంచి ప్రారంభం కానుండగా.. క్రికెట్ పోటీలు 24 నుంచి మొదలవుతాయి. సెప్టెంబర్ 19, 20 తేదీల్లో హాంకాంగ్‌తో జపాన్ రెండు మ్యాచ్‌లు ఆడనుంది. అనంతరం 24న ఆఫ్ఘనిస్థాన్‌తో, 26న నేపాల్‌తో తలపడనుంది.

జపాన్ జట్టు: కెండిల్ కడోవాకి ఫ్లెమింగ్, చార్లీ హరా హింజే, బెంజమిన్ ఇటో డేవిస్, అలెస్టర్ కడోవాకి, కోహియే కుబోటా, కేజ్ కుసుడా, వాటారు మియావుచి, రియో సకురానో థామస్, అలెక్స్ షిరాయి పట్మోర్, షోమా సుగయా స్లేటర్, డెక్లన్ సుజుకి మెక్‌కాంబ్, సుయోచి తకడా, ఇబ్రహీం తకహషి, మకోటో తనియామా, లాచ్లన్ యమమాటో.



# ఫైనల్‌లో మరోసారి దాయాదుల పోరు..!

బలగం టీవీ, హైదరాబాద్

మహిళల ఆసియా కప్–2026లో భారత జట్టు హ్యాట్రిక్ విజయాలతో సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. మరోవైపు భారత్ చేతిలో చిత్తుగా ఓడిన పాకిస్థాన్ కూడా నాకౌట్ దశకు అర్హత సాధించింది. హాంకాంగ్‌తో జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో పాకిస్థాన్ 72 పరుగుల తేడాతో విజయం సాధించి సెమీస్ బెర్త్ ఖరారు చేసుకుంది.

శుక్రవారం జరిగే రెండో సెమీఫైనల్‌లో పాకిస్థాన్.. ఆతిథ్య శ్రీలంకతో తలపడనుంది. భారత్ సెమీఫైనల్ ప్రత్యర్థి మాత్రం ఇంకా ఖరారు కాలేదు. బంగ్లాదేశ్, యూఏఈ మధ్య జరిగే మ్యాచ్‌లో విజేతతో టీమిండియా తలపడనుంది. ప్రస్తుత ఫామ్‌ను చూస్తే భారత్ ఫైనల్‌కు చేరే అవకాశాలు మెరుగ్గా ఉన్నాయి.

ఇక భారత్, పాకిస్థాన్ జట్లు తమ సెమీఫైనల్ మ్యాచ్‌ల్లో గెలిస్తే సెప్టెంబర్ 13న జరిగే ఫైనల్‌లో మరోసారి దాయాదుల పోరు జరగనుంది. లీగ్ దశలో ఇరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో భారత్ ఏకపక్ష విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ 55 పరుగులకే కుప్పకూలగా.. భారత్ 8.4 ఓవర్లలోనే 56 పరుగులు చేసి ఘన విజయం సాధించింది.

అయితే ఆ ఓటమి అనంతరం కూడా పాకిస్థాన్ కోచ్ వహాబ్ రియాజ్ తమ జట్టు టైటిల్ గెలుస్తుందనే ధీమా వ్యక్తం చేశాడు. భారత్‌ను ఎలాగైనా ఓడించాలని పాకిస్థాన్ అభిమానులు కోరుతుండగా.. ఫైనల్‌లో మరోసారి టీమిండియాతో తలపడితే అంతకుమించిన సమాధానం ఇస్తామంటూ భారత అభిమానులు సామాజిక మాధ్యమాల్లో స్పందిస్తున్నారు.

# పీసీబీ వేల డాలర్లు బాకీ

బలగం టీవీ, హైదరాబాద్



పాకిస్థాన్ క్రికెట్ బోర్డు తనకు వేలాది డాలర్లు బాకీ ఉందని ఆ జట్టు మాజీ కోచ్, ఆస్ట్రేలియా మాజీ దిగ్గజ బౌలర్ జేసన్ గిలెస్పీ ఆరోపించారు. పాక్ క్రికెట్‌లో ప్రస్తుతం నెలకొన్న పరిణామాలపై స్పందించిన ఆయన.. చీఫ్ సెలెక్టర్‌గా ఆకి జావిద్ నియమితులైన తర్వాత జట్టు క్షీణించడం ప్రారంభమైందని పేర్కొన్నారు.


పీసీబీ చైర్మన్ మోషిన్ నఖ్వీ నియమించిన ఆకిబ్ జావిద్ తనకు నచ్చినట్ల వ్యవహరించారని గిలెస్పీ ఆరోపించారు. ఆకిబ్ రాకతో పాక్ క్రికెట్‌తో తన సంబంధం కూడా మారిపోయిందన్నారు. గతంలో ఆటగాళ్లు, సిబ్బంది ఎంపికలో తనకు కీలక పాత్ర ఉండేదని, అయితే ఆకిబ్ జావిద్ వచ్చిన తర్వాత తన బాధ్యతలు పాత్ర పూర్తిగా కనుమరుగయ్యాయని తెలిపారు.

ఈ పరిణామాలు తన కోచింగ్ సామర్థ్యంపైనా ప్రభావం చూపాయని గిలెస్పీ అన్నారు. తన సూత్రాలకు కట్టుబడి ఉన్నందున ఆకిబ్ జావిద్ తీసుకొచ్చిన మార్పులను అంగీకరించలేదని, అందుకే పాక్ జట్టు కోచింగ్ బాధ్యతల నుంచి తప్పుకున్నట్లు వెల్లడించారు.

ఆకిబ్ తన పట్ల అమర్యాదగా వ్యవహరించారని, ఆయనకు పీసీబీ చైర్మన్ అండదండలు ఉన్నాయని గిలెస్పీ పేర్కొన్నారు. జట్టు విషయంలో ఆకిబ్ ఇతరుల సలహాలను స్వీకరించేవారు కాదని ఆరోపించారు. పీసీబీలో ఆకిబ్ జావిద్ కొనసాగినంతకాలం పాకిస్థాన్ క్రికెట్ మరింత వెనుకబడుతుందని వ్యాఖ్యానించారు.

# CINEMA

## బేబీ బంప్‌తో దీపికా పదుకొనె..




### కూతురు దువాతో రణ్‌వీర్ లవ్లీ మూమెంట్స్..!

బాలీవుడ్ స్టార్ కపుల్ దీపికా పదుకొణె, రణ్‌వీర్ సింగ్ తమ కూతురు దువాతో గడిపిన అందమైన క్షణాలకు సంబంధించిన ఫోటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి. తండ్రి రణ్‌వీర్ సింగ్ తన చిన్నారి ప్రిన్సెస్ దువాతో సరదాగా గడుపుతుండగా తీసిన పిక్స్ అభిమానులను అమితంగా ఆకట్టుకుంటున్నాయి.రెండో సంతానానికి జన్మనివ్వబోతున్న ఈ సమయంలో, దీపికా పదుకొణె తన బేబీ బంప్‌తో కనిపించిన ఈ ఫోటోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. దువా ముద్దులొలికే క్యూట్ లుక్స్, ఈ జంట సంతోషకరమైన ఫ్యామిలీ మూమెంట్స్ చూసి నెటిజన్లు, అభిమానులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

## 'ఎపిక్' అలాంటి సినిమా కాదు - నాగవంశీ



యంగ్ డైరెక్టర్ ఆదిత్య హాసన్ తెరకెక్కించిన యూత్‌ఫుల్ ఎంటర్టైనర్ 'ఎపిక్ -- ఫస్ట్ సెమిస్టర్' చిత్రంపై నిర్మాత సూర్యదేవర నాగవంశీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇటీవల విడుదలైన ట్రైలర్‌పై సోషల్ మీడియాలో వస్తున్న రెస్పాన్స్ పై ఆయన స్పందిస్తూ.. "కేవలం 'ఎపిక్' ట్రైలర్ మాత్రమే చూసి సినిమాపై ఒక అంచనాకి వచ్చేయకండి. ఈ చిత్రంలో ప్రమోషనల్ కంటెంట్‌లో చూపించిన దానికంటే చాలా ఎక్కువ విషయాలు ఉన్నాయి" అని తెలిపారు. సినిమాలో బ్యూటిఫుల్ ఎమోషన్స్, ఫ్యామిలీ డ్రామా, ఆకట్టుకునే లవ్ స్టోరీతో పాటు మనసును హత్తుకునే అనేక సన్నివేశాలు ఉన్నాయని నాగవంశీ పేర్కొన్నారు. థియేటర్లలో ఈ సినిమాని స్వయంగా చూసి ఆ అనుభూతిని పొందాలని ప్రేక్షకులను కోరారు.అనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటించిన ఈ చిత్రానికి సంబంధించి సెప్టెంబర్ 10న గ్రాండ్ ప్రిమియర్స్ ప్లాన్ చేశారు. హేషమ్ అబ్దుల్ వాహబ్ సంగీతం అందించిన ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి రెస్పాన్స్ అందుకుంటుందో చూడాలి.

## 'రణబాలి' ర్యాంపేజ్‌కు టైమ్ ఫిక్స్ చేసిన విజయ్ దేవరకొండ..!



రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ నటిస్తున్న ది మోస్ట్ అవైటెడ్ పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం 'రణబాలి' నుంచి మేకర్స్ టీజర్ రిలీజ్ చేసేందుకు సిద్ధమయ్యారు. దర్శకుడు రాహుల్ సాంకృత్యాన్ తెరకెక్కిస్తున్న ఈ చిత్ర టీజర్‌ను సెప్టెంబర్ 9న రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు.అయితే, రణబాలి విధ్వంసం ఎలా ఉండబోతుందో చూసేందుకు తాజాగా మేకర్స్ టైమ్ ఫిక్స్ చేశారు. రణబాలి టీజర్‌ను సెప్టెంబర్ 9న సాయంత్రం 4.05 గంటలకు రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ తాజాగా వెల్లడించారు. రాక్షసుడిలా కనిపించే వ్యక్తి ప్రతిజ్ఞ తీసుకుంటే ఎలా ఉండబోతుందో ఈ టీజర్‌లో చూపెట్టబోతున్నట్లు తాజాగా పోస్టర్ ద్వారా వెల్లడించారు.మాస్, యాక్షన్ అంశాలతో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈ చిత్రం నుంచి వస్తున్న ఈ 'సావేజ్‌ఓత్' అప్‌డేట్ టీజర్‌పై అంచనాలను ఒక్కసారిగా పెంచేసింది. ఇక ఈ సినిమాలో రష్మిక మందన్న హీరోయిన్‌గా నటిస్తుండగా అజయ్-అతుల్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.

## 'సూర్య 47' నుంచి సాలిడ్ అప్డేట్..?

తమిళ స్టార్ హీరో సూర్య ఇటీవల 'విశ్వనాథ్ అండ్ సన్స్' చిత్రంతో బ్లాక్‌బస్టర్ హిట్ అందుకున్నాడు. ఇక ఆయన నటిస్తున్న తన నెక్స్ట్ చిత్రానికి సంబంధించి కూడా అప్పుడే అప్డేట్ ఇచ్చేందుకు సూర్య అండ్ టీమ్ రెడీ అయ్యారు. 'సూర్య 47'గా తెరకెక్కుతున్న ఈ సినిమాకు సంబంధించి ఫస్ట్ లుక్‌ను సెప్టెంబర్ 9న సాయంత్రం 6 గంటలకు రివీల్ చేయబోతున్నట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించారు.ఈ సినిమాలో సూర్య పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటించబోతున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ సినిమాలో నజ్రియా ఫహాద్, నస్లేన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకు సుషిన్ శ్యామ్ సంగీతం అందిస్తుండగా జిత్తు మాధవన్ డైరెక్ట్ చేస్తున్నారు. 2డి ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ సినిమా నుంచి రాబోయే ఈ స్పెషల్ ఎంట్రీ సినిమాపై ఒక్కసారిగా అంచనాలు పెంచేసింది. మరి సూర్య 47 నుంచి రాబోయే ఈ స్పెషల్ ఎంట్రీ ఎలా ఉండబోతుందో తెలియాలంటే మరికొద్ది గంటలు వెయిట్ చేయాల్సిందే.



## స్లిమ్ లుక్ లో చరణ్..

### గేమ్ ఛేంజర్ నుంచి ఇప్పుడు RC 17 వరకు చరణ్ సాలిడ్ ట్రాన్స్ఫర్మేషన్



ప్రస్తుతం మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా దర్శకుడు సుకుమార్ తో ఓ భారీ సినిమా చేయనున్న సంగతి అందరికీ తెలిసిందే. చరణ్ కెరీర్ 17వ సినిమాగా మేకర్స్ భారీ లెవెల్లో దీన్ని ప్లాన్ చేస్తున్నారు. అయితే ఈ సినిమా కోసం ఎదురు చూస్తున్న మెగా ఫ్యాన్స్ కి చరణ్ లేటెస్ట్ గా కొత్త లుక్స్ తో కిక్ ఇస్తున్నాడు. గత సినిమా పెద్ది కోసం పెంచిన పొడవాటి శిరోజాలు అలానే ఉంచి మిగతా బాడీ అంతా స్లిమ్ చేసేసాడు.దీనితో సుకుమార్ సినిమాలో చరణ్ లుక్ అదిరేలా ఉందని ఫ్యాన్స్ భావిస్తున్నారు. అయితే చరణ్ గేమ్ ఛేంజర్ లోనే మూడు వెరియేషన్స్ చూపించి ట్రాన్స్ఫర్మేషన్ అంటే ఏంటో తన డెడికేషన్ తో ఆశ్చర్య పరిచాడు. మళ్లీ పెద్ది లో కూడా పలు షేడ్స్ ఇపుడు మళ్లీ సుకుమార్ ప్రాజెక్ట్ కోసం కొత్తగా మారిపోయాడు.ఇలా సినిమా సినిమాకి ఇంత భిన్నంగా కనిపించడం అనేది రామ్ చరణ్ తాలూకా డెడికేషన్ ని చూపిస్తుంది. ఇక సుకుమార్ సినిమాకి ఒకటేలుక్‌ఉంటుందా లేకగతసినిమాల్లోలానేరెండుమూడుఉంటాయాఅనేది వేచి చూడాలి.



## 'కాకా' నుంచి యంగ్ బ్యూటీ ఫస్ట్ లుక్..

### ఆమెకి నీడగా, అండగా మెగాస్టార్ షాడో

ప్రస్తుతం టాలీవుడ్ లో వరుస అవకాశాలు చేజిక్కించుకొని మంచి ఫామ్ లో ఉన్న యంగ్ హీరోయిన్స్ లో యువ బ్యూటీ అనస్వర రంజన్ కూడా ఒకరు. అయితే అనస్వర చేతిలో ఉన్న బిగ్గెస్ట్ ప్రాజెక్ట్ ఏదన్నా ఉంది అంటే అది మెగాస్టార్ చిరంజీవి కాంబినేషన్లో చేస్తున్న క్రేజీ ప్రాజెక్ట్ కాకా అనే చెప్పాలి.ఈ సినిమాలో చిరుకి కూతురు పాత్రలో నటిస్తున్న ఆమె తాలూకా ఫస్ట్ లుక్ పోస్టర్ ని మేకర్స్ ఇప్పుడు విడుదల చేసారు. ఇక ఇందులో ఆమె బ్యూటిఫుల్ లుక్ లో హోమ్లీగా కనిపిస్తోంది. ఇక ఆమెకి ఎల్లప్పుడూ నీడగా, తన గుండె చప్పుడే అమెగా మెగాస్టార్ చిరంజీవిని చూపిస్తూ ఆమెకి ఎన్నడూ నీడగా అండగా కాపాడుకునే కాకా గా కనిపించబోతున్నట్టు రెండు కోణాలని ఈ పోస్టర్ లో చెప్పడం విశేషం.మొత్తానికి ఒక ప్యాకెడ్ ఎంటర్టైనర్ గా ప్లాన్ చేస్తున్న ఈ సినిమా సంక్రాంతికి ఎలాంటి ట్రీట్ ఇస్తుందో చూడాలి. ఇక ఈ సినిమాకి థమన్ సంగీతం అందిస్తున్నాడు. అలాగే ఈ కే వి ఎన్ సంస్థ నిర్మాణం వహిస్తున్న సంగతి తెలిసిందే.

## సెన్సార్ పనులు ముగించుకున్న 'మహేంద్రగిరి వారాహి'..

### సుమంత్ ఈసారి గట్టిగా కొట్టేందుకు రెడీ..!

టాలీవుడ్ హీరో సుమంత్ నటించిన సోషియో ఫాంటసీ మిస్టరీ థ్రిల్లర్ 'మహేంద్రగిరి వారాహి' సెప్టెంబర్ 11న థియేటర్లలో గ్రాండ్ రిలీజ్‌కు రెడీ అయింది. సంతోష్ జాగర్లపూడి దర్శకత్వం వహించిన ఈ చిత్రం ప్రమోషనల్ కంటెంట్‌తో ప్రేక్షకుల్లో మంచి బజ్ క్రియేట్ చేసింది. ఇక ఈ సినిమా తాజాగా సెన్సార్ పనులు ముగించుకుని రిలీజ్‌కు రెడీ అయింది.ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు 'యూ/ఏ' సర్టిఫికేట్ ఇచ్చింది. పురాతన మహేంద్రగిరి నేపథ్యంతో సాగే ఈ చిత్రం, వారాహి అమ్మవారికి సంబంధించిన ఒక రహస్యమైన తరాల శాపం చుట్టూ తిరుగుతుంది. ఒక రాజవంశానికి చెందిన పురుష వారసులు 33 ఏళ్ల వయస్సులోనే మరణిస్తుండటం, ఈ విషాదం గత 150 ఏళ్లుగా కొనసాగుతుండటం కథలో ముఖ్యమైన అంశం. ఈ మరణాలను దైవాగ్రహంగా భావిస్తున్న తరుణంలో, ఆ పురాతన రహస్యం వెనుక ఉన్న నిజాలను వెలికితీసి, ఆ శాపానికి ముగింపు పలకడానికి సుమంత్ పాత్ర ఎలా పోరాడింది అనేది చిత్ర ప్రధానాంశం.ఈ సినిమాలో సుమంత్‌తో పాటు మీనాక్షి గోస్వామి, ఐశ్వర్య రాజేష్, మాళవికా నాయర్ కీలక పాత్రల్లో నటించగా, సిద్ధు జొన్నలగడ్డ ఒక క్యామియో పాత్రలో కనిపించనున్నాడు. రాజశ్యామల ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు బ్రిడ్జ్ ఫిల్మ్స్ బ్యానర్లపై కాళిపు మధు, సురభి లక్ష్మణ్ రావు నిర్మించిన ఈ చిత్రానికి అనూప్ రూబెన్స్ సంగీతాన్ని అందించాడు.

